నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | మార్చి 09, 2024 | www.navatelangana.com

ఐస్‌తో శివలింగం


ఐస్‌తో రూపొందించిన శివలింగం

నవతెలంగాణ-తాడ్వాయి

శివరాత్రి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. పలువురు వివిధ పద్దతుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. పలువురు మాత్రం వేడుకల్లో వినూత్నత చూపించారు. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన శ్రీనిత, శ్రేయాస్ అనే పిల్లలు మాత్రం ప్రత్యేకంగా నిలిచారు. అందరిలా కాకుండా ఐస్‌తో శివలింగాన్ని రూపొందించి అందరిని ఆశ్చర్యపరిచారు. తల్లిదండ్రుల సాయంతో ఐస్‌తో శివలింగాన్ని రూపొందించి ప్రత్యేక పూజలు చేశారు. ఐస్‌తో చేసిన శివలింగాన్ని చూసిన స్థానికులు పిల్లలను అభినందించారు.

మహిళా చిత్రం తయారీలో కళాకారుని నైపుణ్యం


కూరగాయలతో మహిళ చిత్రపటం రూపకల్పన

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్ట్స్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న భాసా బాలకిషన్.. మహిళా దినోత్సవం పురస్కరించుకొని కూరగాయలతో మహిళా చిత్రపటాన్ని రూపొందించిన తన కళా నైపుణ్యం ప్రదర్శించారు. కూరగాయలతో తయారుచేసిన మహిళా చిత్రం చూసి ప్రతి ఒక్కరూ ఆ కళాకారులు నైపుణ్యానికి అభినందిస్తున్నారు. కూరగాయలతో మహిళ చిత్రపటం అందరినీ ఆకర్షిస్తోంది.

శైవక్షేత్రాల్లో శివోహం..

- శివనామ స్మరణతో మారు మోగిన ఆలయాలు • జాగరణకు ఈసారి ప్రత్యేక ఏర్పాట్లు.. సెట్టింగ్‌లు, ఈవెంట్‌లు


నగరంలోని శంభుని గుడి వద్ద బారులు తీరిన సందర్శకులు


రామారెడ్డిలోని స్వయంబు ఇుగ్గ రామలింగేశ్వర ఆలయం వద్ద రథాన్ని లాగుతున్న సందర్శకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్/కామారెడ్డి

మహాశివరాత్రి పురస్కరించుకొని శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమ్రోగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలు సందర్శకుల తాకిడితో కిటకిటలాడాయి. శివలింగాలను పూజిస్తూ అభిషేకాలు చేశారు. కాగా పలు ప్రధాన ఆలయాల్లో సందర్శకులు బారులు తీరారు.

నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో

నగరంలోని నీలకంటేశ్వర ఆలయంలో శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ఆలయంలో అభిషేకాలు కొనసాగాయి. నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ పర్యవేక్షణలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, అరటి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గింజుపల్లి వేణు, అర్చకులు సుహాస్ మకరంద్ నీలేష్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శంభు లింగేశ్వర ఆలయంలో...

నగరంలోని అహ్మదీబజార్‌లో ఉన్న శంభు లింగేశ్వర ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం నాలుగు గంటల నుండి శివునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత హాజరై శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రోటరీ క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో భక్తులకు కొబ్బరి స్వీట్, సాబుదాన ప్రసాదం పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ప్రతి సంవత్సరం భక్తులకు ప్రసాదాన్ని అందజేస్తామని తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామ్ రవీందర్ గుప్తా పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లింగం, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


వీటితో పాటు నగరంలోని దేవి రోడ్డు వద్ద గల మనోకామేశ్వరాలయంలో రుద్రాభిషేకం, అభిషేకాలు నిర్వహిం చారు. అదే విధంగా కోటగల్లీలో గల మల్లికార్జున ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు.


జాగరణకు ప్రత్యేక సెట్టింగ్‌లు..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి జాగరణకు పలు చోట్ల ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా సెట్లు వేసి.. కళాకారులను రప్పించి గాన కచేరిలు చేయించారు. గతంలో ప్రధాన ఆలయాల వద్ద రాత్రి జాగరణ చేసి తెల్లవారు జామున అన్నదానం చేసేవారు. ప్రస్తుతం గల్లీల్లో సైతం ఆలయాల వద్ద ఏర్పాట్లు చేయడం గమనార్హం.


జాగరణలో భాగంగా నిజామాబాద్‌లో క్రికెట్ పోటీలు..


నీలకంఠేశ్వరాలయంలో బారులు..


కామారెడ్డిలో భారీ సెట్టింగ్‌లు


ఘటన చోటుచేసుకున్న ఎస్సారెస్పీ లక్ష్మీ కాలువ హెడ్ రెగ్యులేటర్ ప్రాంతం

ఆటవిడుపు.. ఆయువు తీసింది

- ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చి కాలువలో గల్లంతై ముగ్గురు యువకులు మృతి
- మృతులు పది, ఇంటర్ విద్యార్థులు • పండుగ పూట పెను విషాదం

వివరాలు మెయిన్‌లో..


సాయినాథ్ మున్నా లోకేశ్ (ఫైల్)

నవతెలంగాణ-ముప్కాల్/జక్రాన్‌పల్లి

ఆటవిడుపుగా ఎస్సారెస్పీ ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ఆరుగురు యువకుల్లో ముగ్గురు యువకులు లక్ష్మీకాలువలో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందారు. ఈ విషాదకర ఘటన నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం గన్యాతండాకు చెందిన ఆరుగురు యువకులు లోకేశ్ (17), సాయినాథ్ (16), మున్నా (17), సబావత్ వంశీ, అజ్మీర సందీప్, భూక్య భాస్కర్ కారు తీసుకొని ఎస్సారెస్పీ ప్రాజెక్టు సందర్శనకు వచ్చారు. లక్ష్మీ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద స్నానానికని నది పరివాహక ప్రాంతమైన లక్ష్మీ కాలువలోకి దిగారు. వారిలో ముగ్గురు లోకేష్, సాయినాథ్, మున్నా నీటి ప్రవాహానికి గల్లంతు అయ్యారు.


గాలింపు చర్యలు చేపడుతున్న గజ ఈతగాళ్లు..


గాలింపు చర్యల్లో స్వయంగా పాల్గొని మృతదేహాన్ని వెలికి తీస్తున్న బాల్కొండ ఎస్ఐ గోపి

జహీరాబాద్ బరిలో సురేశ్ షెట్కార్

- అభ్యర్థిని ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్టానం


సురేశ్ షెట్కార్

నవతెలంగాణ-కామారెడ్డి

లోక్ సభ ఎన్నికలకు బరిలో నిలబడే అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ అధిష్టానం శుక్రవారం విడుదల చేసింది. కాగా జహీరాబాద్ నుంచి మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఓ సారి ఎమ్మెల్యేగా, ఓ సారి ఎంపీగా సురేశ్ షెట్కార్ గెలుపొందారు.

సురేష్ షెట్కార్ స్వస్థలం సంగారెడ్డి జిల్లా(పూర్వ మెదక్) నారాయణ్‌ఖేడ్. 1960 ఆగస్టు 8న జన్మించారు. 1982లో మహారాష్ట్రలోని మరట్వాడా యూనివర్సిటీ నుంచి బీఎస్సీ అగ్రికల్చర్‌లో డిగ్రీ పట్టా పొందారు. 2004లో కాంగ్రెస్ పార్టీ నుండి నారయణ్‌ఖేడ్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. తదనంతరం 2009లో జహీరాబాద్ పార్లమెంట్ నుంచి పోటీ చేసి ఎంపీగా గెలుపొంది 2014 వరకు కొనసాగారు.

2014లో పోటీ చేసినా ఓడిపోయారు. 2019లో జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మదన్‌మోహన్‌రావు పోటీ చేసి 6 వేల స్వల్పఓట్ల తేడాతో ఓడిపోయారు. అయితే తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఇక్కడి నుంచి బరిలో నిలిచేవారిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సురేశ్ షెట్కార్ బరిలో నిలవనున్నట్టు ఇది వరకే సంకేతాలు వచ్చాయి. మొదటి నుండి షబ్బీర్ అలీతో సురేశ్ షెట్కార్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.

రాజీవ్‌నగర్ తాండాలో నీటి కొరత


నీటి కోసం పొలం వద్దకు..

నవతెలంగాణ-బోధన్

మండలంలోని రాజీవ్‌నగర్ తాండాలో నీటి కొరతతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో కొంతమంది మోటర్లు వినియోగించడం వలన సరిగా నీరు రావడం లేదని కాలనీవాసులు వాపోయారు. ప్రస్తుతం వేసవికాలం సందర్భంగా నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, మోటర్లతో నీటిని తోడుకునే వారిపై చర్యలు తీసుకుని వాటిని సీజ్ చేయాలని పలువురు కోరారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి

ఆస్పత్రిలో వైద్య చికిత్సకు వెళ్తుండగా ఘటన


శివరాజ్, రవీందర్(ఫైల్)

నవతెలంగాణ-ఆర్మూర్/మోర్తాడ్

డయాలసిస్ చేయించుకునేందుకు ఆస్పత్రికి వెళ్తుండగా.. రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతిచెందారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ 44వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. మోర్తాడ్ మండలంలోని దొనకల్ గ్రామానికి చెందిన మాడవీడి రవీందర్ (55) గత కొన్ని సంవత్సరాల క్రితం గల్ఫ్ నుంచి తిరిగి వచ్చారు. అనారోగ్యానికి గురికాగా డయాలసిస్ చేయించుకునేందుకు కొడుకు శివరాజ్ (24)వెంట తీసుకొని బైక్‌పై ఆర్మూర్ వైపు వస్తున్నారు.

వివరాలు మెయిన్‌లో..

ఆలయం ఎదుట అగ్నిప్రమాదం

- రెండు గదులు అగ్నికి ఆహుతి


చెలరేగుతున్న మంటలు


మంటలకు కాలిపోయిన నోట్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శంభుని శివాలయం ఎదుట గల భవనంలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని ప్రముఖ దైవ క్షేత్రం శంభునిగుడి ఆలయం వద్ద అహ్మద్ ఎస్టేట్ అనే భవనంలో ప్రమాదవశాత్తు కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో ఒక పోర్షన్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ శాఖ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అక్కడున్న గ్యాస్ సిలిండర్లను అగ్నిమాపక సిబ్బంది తొలగించి మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదం లేడీస్ టైలర్ కార్యకలాపాలు నిర్వహించే ప్రాంతంలో చోటుచేసుకోవడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని స్థానికులు, పోలీసులు, అదేవిధంగా అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలిపారు. షాప్ నిర్వాహకురాలు డ్వాక్రా సంఘం సభ్యురాలని సమాచారం. చీరల అమ్మకం తాలూకుతో పాటు నిల్వ ఉంచిన ఐదు లక్షల కరెన్సీ నోట్లు అగ్ని ప్రమాదంలో కొన్ని పూర్తిగా మరికొన్ని పాక్షికంగా కాలిపోయాయి అని తెలిసింది. అయితే ప్రస్తుతం కాలిపోయినటువంటి కరెన్సీ మాత్రం చలామణి కావు అని సంబంధిత అధికారులు నిర్ధారించారు. ఆస్తి నష్టం అంచనాను అధికారులు ఇంకా తెలియజేయలేదు. పూర్తిగా అంచనా వేసిన అనంతరం మిగతా వివరాలను వెల్లడిస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.


గర్భిణులకు నిలిచిన ఆర్థికసాయం

- ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేసుకుంటే నాలుగు దఫాల్లో రూ.12 నుంచి 13 వేల ఆర్థిక సాయం అమలు
- మూడేండ్లుగా అందని వైనం
- కొత్త ప్రభుత్వం మీదనే ఆశలు
- మాతా, శిశుసంరక్షణ కార్డులు లేక జిరాక్స్‌లు అందజేస్తున్న వైనం

నవతెలంగాణ-ఏర్గట్ల

మాతా,శిశురక్షణకు ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశ పెడుతుంటాయి. ప్రారంభంలో పకడ్బందీగా అమలు చేసినా.. తర్వాత వాటిని పట్టించుకునే వారు కరువవుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచడంతో పాటు మహిళ గర్భం దాల్చిన నుంచి శిశువుకు జన్మనిచ్చిన ఆరు నెలల వరకు వారికి పౌష్టికాహారం అందించడంతో పాటు 12 వేల ఆర్థిక సాయం అమల్లో ఉంది. పథకం ప్రారంభంలో అమలు చేసినా.. దాదాపు మూడేండ్ల నుంచి ఆర్థిక సాయం నిలిచిపోయింది. పైగా మాతా శిశురక్షణ కార్డులు సైతం అందక జిరాక్స్‌లు తీసుకోవాల్సి వస్తుంది.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు గత ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. మాతా శిశుసంరక్షణతో పాటు పౌష్టికాహారలోపానికి గురికావొద్దని ప్రత్యేక పథకం ప్రారంభించింది. ఆడబిడ్డ పుడితే రూ.13వేలు, మగబిడ్డ పుడితే రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం అందించేలా పథకం రూపొందించారు. వివాహిత గర్భం దాల్చినప్పటి నుంచి తొమ్మిదో నెల వరకు నాలుగు దశల్లో ఆర్థిక సాయాన్ని అందించేలా పథకం రూపొందించారు. 5 నుంచి 6 నెలల మధ్య ఆరోగ్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు వచ్చినప్పుడు రూ.3వేలు, ప్రసవ సమయంలో బాబు పుడితే రూ.2వేలు, పాప పుడితే రూ.5వేలు ఇస్తారు. శిశువుకు మూడున్నర నెలల్లో టీకాలు వేయిస్తే రూ.2వేలు, 9 నెలల్లో టీకాలు వేయిస్తే రూ.3వేలను బ్యాంక్ అకౌంట్లలో జిల్లా అధికార యంత్రాంగం జమ చేయాల్సి ఉంటుంది. అయితే దాదాపుగా మూడేండ్ల నుంచి లబ్దిదారులకు డబ్బులు జమ కాలేవు. ఆశాలను, అంగన్‌వాడీలను అడుతూ ప్రభుత్వ ఆస్పత్రి చుట్టూ లబ్దిదారులు తిరుగుతున్నారు. ఇదే విషయమై వైద్యాధికారులను ఆరా తీయగా.. లబ్దిదారుల వివరాలు అన్ని ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు పంపించామని, నేరుగా లబ్దిదారుల ఖాతాలోనే డబ్బులు జమఅవుతాయని అంతకుమించి తమ వద్ద ఎలాంటి సమాచారం ఉండదని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా చొరవ చూపి పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సాయం డబ్బులు ఖాతాల్లో పడేలా కృషి చేయాలని లబ్దిదారులు కోరుతున్నారు.



కార్డు లేక జిరాక్సులు

జిరాక్సులే మాతా, శిశు సంరక్షణ కార్డులు

వివాహిత గర్భం దాల్చిన మొదలు (ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ) నుండి ప్రభుత్వం లబ్దిదారులకు మండల ప్రభుత్వ వైద్యులు "మాతా, శిశుసంరక్షణ" కార్డును ఇస్తారు. ఇందులో ప్రారంభంలో గర్భిణి ఆరోగ్య వివరాలతో తీసుకోవాల్సిన టీకాల వివరాలు పొందుపరుస్తుంటారు. తదనంతరం శిశువు, బాలింత ఆరోగ్య విషయాలు, టీకాలకు సంబంధించిన ముఖ్య సమాచారాన్ని పొందుపరుస్తారు. ఈ మాతా, శిశు సంరక్షణ కార్డును మహిళ గర్భిణీ అని తెలిసిన నాటి నుండి ఆడ పిల్ల గాని మగ పిల్లవాడు గాని జన్మించి, వారికి 16 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు లబ్ధిదారురాలు తమ వద్దే ఉంచుకోవలసి ఉంటుంది. దాదాపు 16 సంవత్సరాల వరకు ఉండవలసిన ఈ కార్డును గత మూడు సంవత్సరాలుగా అందడం లేదని ప్రభుత్వ వైదులు చెపుతున్నారు. ఆరోగ్య శాఖ నుండి ఉచితంగా ఇవ్వవలసిన కార్డు రాకపోవడంతో.. లబ్దిదారులు ఒరిజినల్ కార్డును మండల, గ్రామ ప్రభుత్వ వైదులు నుండి తీసుకుని, జిరాక్స్ సెంటర్ కు తీసుకువెళ్ళి 70 రూపాయల నుండి 90 రూపాయలు వెచ్చించి జిరాక్స్ తీయించుకుంటున్నారు. ముఖ్యమైన కార్డు అవడంతో జిరాక్స్‌ను 16 సంవత్సరాలు ఎలా భద్రంగా ఉంచుకోవాలో తెలియక లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉచితంగా వచ్చే కార్డుకు డబ్బులు చెల్లించి జిరాక్స్ తీసుకుంటు న్నామని, ప్రభుత్వం తమ గోడు వినాలని లబ్దిదారులు వేడుకొంటున్నారు. ఈ విషయమై మండల వైద్యులను సంప్రదించగా తమకు మూడు సంవత్సరాలుగా సరిపోయేటన్ని కార్డులను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అందించడం లేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్డులను సరిపడా సరఫరా చేయాలని లబ్దిదారులు కోరుతున్నారు.



ఏర్గట్లల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరిచాం

ప్రసన్న ప్రియ. మెడికల్ ఆఫీసర్. ఏర్గట్ల

ఆర్థిక సాయం మగ పిల్లవాడు జన్మిస్తే 12 వేలు, ఆడపిల్ల జన్మిస్తే 13 వేలు బాలింత తల్లి ఖాతాలో విడుతల వారీగా పడుతాయి. గతంలో రెగ్యూలర్‌గా వస్తుండే. ఇప్పుడు రావడం లేదని పలువురు మా దృష్టికి తీసుకొచ్చారు. మా బాధ్యతగా లబ్దిదారుల సమాచారం మొత్తం ఆన్‌లైన్‌లోనైతే పొందు పరుస్తున్నాం. మండలంలో 5 హెల్త్ సబ్ సెంటర్ లు ఉంటే సంవత్సరం నుండి ఇప్పటికి సెంటర్‌కు 10 చొప్పున మొత్తం 50 మాతా శిశు సంరక్షణ కార్డులు వచ్చాయి. సరిపడా కార్డులు రాకపోవడంతో లబ్దిదారులు ఒరిజినల్ కార్డుతో జిరాక్స్ తీసుకుంటుంది వాస్తవమే. వారికి సమాధానం చెప్పలేక మా వైద్య సిబ్బంది కూడా గ్రామాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎస్బిఐ స్వయం సిద్ధ పథకం చెక్కు అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ ఎస్బీఐ శాఖల్లో స్వయం సహాయక బృందాలు ఎస్.హెచ్.జీ. సభ్యులకు స్వయం సిద్ధ పథకం కింద వ్యాపార రుణాలను అందించారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తుందని, అందుకే మహిళలకు స్వయంసిద్ధ పథకం ద్వారా వ్యాపార రుణాలను అందజేశారు. తద్వారా వ్యాపార అభివృద్ధితోపాటు వ్యక్తిగత అభివృద్ధి కూడా జరుగుతుందని, ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని బ్యాంక్ అధికారులు తెలిపారు.


చెక్కు అందుకుంటున్న మహిళలు

జీరో విద్యుత్ బిల్లు అందజేత

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూరు మండలంలోని గుత్ప గ్రామంలో జీరో విద్యుత్ బిల్లును మాజీ సర్పంచ్ గంట చిన్నయ అధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహ జ్యోతి పథకం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా గృహ జ్యోతి పథకం ప్రారంభించడం పట్ల గుత్ప మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ నియోజకవర్గ అధ్యక్షులు బాశెట్టి శశి కుమార్, సీనియర్ నాయకులు జితేందర్, భూమేశ్వర్, పోశన్న, ప్రసాద్, నజీర్, భూమేశ్వర్ యూత్ నాయకులు షబ్బీర్, జగదీష్, సతీష్, అరుణ్, సందీప్ పాల్గొన్నారు.


విద్యుత్ బిల్లు అందిస్తున్న నాయకులు

సిసి రోడ్డు పనులకు భూమిపూజ


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్ తెలిపారు. సిసి రోడ్డుకోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి 20 లక్షలు రూపాయలు మంజూరు అయిన సీసీ రోడ్డును కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. 20 లక్షల రూపాయలు మంజూరు కావడానికి సహకరించిన ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాట్పల్లి నర్సిరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు సొప్పరి వినోద్, మునిపల్లి మాజీ సర్పంచ్ చిన్న సాయి రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ గన్న లక్ష్మి, మైనార్టీ అధ్యక్షులు సైకిల్ టేక్స్ అక్బర్ ఖాన్, జైడి మల్లేష్, రిక్కల సంజయ్, నియమత్ అలీ, వెంకన్న, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతదేహాన్ని త్వరగా రప్పించండి

- కోటపాటిని ఆశ్రయించిన మృతుని కుటుంబ సభ్యులు
- గల్ఫ్‌లో చనిపోయిన బడాభీంగల్ వాసి


కోటపాటికి వినతిపత్రం అందిస్తున్న మృతుని కుటుంబీకులు

నవతెలంగాణ-ఆర్మూర్

గల్ఫ్ దేశం బెహరన్‌లో ఉపాధి కోసం వెళ్ళిన 20 సంవత్సరాల యువకుడు లొక్కిడి రాఘవేందర్ అక్కడ క్లీనింగ్ పనిలో చేరిన కొన్ని నెలలకే గుండెపోటుతో మరణించాడు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రవాస హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహ నాయుడిని కలిశారు. కంపెనీలో పని దొరికిందని తండ్రి, తల్లి, తమ్ముడు సంతోషిస్తున్న సమయంలో తాము నమ్ముకున్న బిడ్డ అకాల మరణ వార్త వినవలసి రావడంతో కుటుంబానికి తీర్చలేని బాధగా మిగిలింది. విషయం తెలిసిన వెంటనే తమ బిడ్డ మృతదేహాన్ని త్వరగా ఇంటికి రప్పించాల్సిందిగా అభ్యర్థించారు. కోటపాటి వెంటనే స్పందించి బెహరన్ లోని ఇండియన్ ఎంబసీ అధికారులకు, అక్కడి తెలుగు సంఘం తెలుగు కళా సమితి అధ్యక్షుడు మురళికి వివరాలు పంపి తగిన సహాయం చేసి మృతదేశాన్ని తొందరగా పంపే ఏర్పాట్లు చేయాలని విన్నవించారు. వారు స్పందించి కావలసిన సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. కోటపాటిని కలిసిన వారిలో మృతుని తమ్ముడు లతీష్ బడా భీంగల్ గల్ఫ్ కార్మిక నాయకుడు ఈర్ల సాయి బాబా, గడ్డం శ్రీకాంత్, మారుతి ఉన్నారు

సభలను విజయవంతం చేయండి

- పౌర హక్కుల సంఘం సభల పోస్టర్ ఆవిష్కరణ


సభల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పౌర హక్కుల సంఘం 50 వసంతాల సభలను ఈనెల 9, 10 తేదీలలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్నాయని, ఈసభలను విజయవంతం చేయాలని ఈసంఘం నాయకులు కోరారు. సభల పోస్టర్లను పౌర హక్కుల నేతలు కొంగర శ్రీనివాస్ రావు, అల్గోట్ రవీందర్, భీక్ సింగ్, జలందర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అల్గోట్ రవీందర్ మాట్లాడుతూ శ్రీకాకుళ రైతాంగ పోరాటాలపై అప్పటి ప్రభుత్వం చేస్తున్న రాజ్యహింసకు వ్యతిరేకంగా, రాజ్యాంగం ప్రజలకు కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ, జీవించే హక్కుల రక్షణ కోసం పౌర హక్కుల సంఘం 1973లో ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వాలు చట్టబద్ధ పాలన చేయాలని,హక్కుల ఉద్యమాన్ని మరింత విస్తృతపరచుకొని సమాజంలోని వివిధ ఆధిపత్య వ్యవస్థలు చేస్తున్న హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా పోరాడుతుందని అన్నారు. కుల వివక్ష, అణచివేతకు గురవుతున్న ప్రజల హక్కుల పరిరక్షణ కోసం, పురుషాధిపత్యానికి బలవుతున్న మహిళల హక్కుల కోసం, కార్మికుల హక్కుల కోసం, అభివృద్ధి పేరుతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా, గిరిజన, ఆదివాసి, రైతాంగ ఉద్యమాలపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా, ప్రాజెక్టుల్లో నిర్వాశితులైన ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. ప్రశ్నిస్తున్న గొంతులను అణచివేయడానికి ఉపా చట్టాన్ని ప్రయోగించి జైల్లో నిర్బంధిస్తుందని చెప్పారు.

మతోన్మాద ఫాసిస్టు విధానాలపై పోరాడుతాం

- మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటిస్తాం

నవతెలంగాణ-సిరికొండ

అంతర్జాతీయ మహిళా పోరాటం దినోత్సవం స్ఫూర్తితో దేశంలో మోడీ అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని, మహిళలపై జరుగుతున్న అన్ని రకాల దాడులను ప్రతిఘటిద్దామని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యు) ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు పి.రమ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని రావుట్ల గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రావుట్ల గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మండల నాయకురాలు బి. మానస అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన సభలో పీఓడబ్ల్యు ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు రమ మాట్లాడుతూ.. మహిళ హక్కుల కోసం అంతర్జాతీయ శ్రామిక మహిళ హక్కుల పోరాట దినోత్సవం స్ఫూర్తిగా తీసుకొని శ్రామిక మహిళలందరూ పోరాటాలకు సిద్ధపడాలని పిలుపును ఇచ్చారు. నేడు సమాజంలో అన్ని వర్గాల స్త్రీల పట్ల ఇంట బయట తీవ్ర వివక్షత, పురుష దురహంకార దాడులు కొనసాగుతూ పురుషాధిపత్యం రాజ్య మేలుతున్నదని, భారతదేశంతో సహా అన్ని దేశాల్లో ఇంటా బయట స్త్రీని ఒక వ్యాపార వస్తువుగా పెట్టుబడిదారి వ్యవస్థ సమాజం పరిగణిస్తున్నదని ఆమె అన్నారు. దేశంలో పేద దళిత ఆదివాసి మైనార్టీ స్త్రీలపై దోపిడీ, అణిచివేత లైంగిక, దాడులు, వరకట్న దురాచారాలు, ప్రేమపేరుతో జరిగే దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నా యన్నారు. దోపిడీ అణిచివేతల మూలాలు వ్యక్తిగత ఆస్తి, పితృస్వామ్య వ్యవస్థ ఏర్పడడం లోనే ఉన్నాయని, సనాతన ధర్మం పేరుతో మళ్ళీ వంచనకు గురిచేస్తున్నాయని అన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు, భద్రతకు సమానత్వంకోసం మనువాదాన్ని, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ బలోపేతం చేస్తు, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని. పిఓడబ్లు పిలుపునిస్తోందని ఆమె పేర్కొన్నారు. మహిళలు హక్కుల కోసం పోరాటం చేయడం తప్ప మరోమార్గం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్ రమేష్, డివిజన్ నాయకులు ఆర్ దామోదర్, పీఓడబ్ల్యు గ్రామ నాయకులు జమున, స్వరూప, మౌనిక, మాధురి, కవిత, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమ

మహిళలు తలుచుకుంటే సమాజాన్ని మరుస్తారు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్త్రీ లేకుంటే ప్రపంచం లేదు, స్త్రీ లేకుంటే సృష్టి లేదని పాటల రూపంలో, మాటల రూపంలో అనేక విషయాలు చెప్పడం జరిగిందని, మీ పట్టుదల చూసుకుంటే, మాడల్ కాలని చేసే సత్తా మీలో ఉందని బిజేపి అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మారుతి నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక్క రోజు కాకుండా ఏడాదిలో 365రోజులు గౌరవిస్తే మహిళలపై గౌరవం పెరిగి అత్యాచారాలు, మహిళలపై అన్యాయాలు తగ్గుతాయని అన్నారు. ప్రధాని మోడీ మహిళలకు గౌరవం ఇస్తూ సుకన్య సంవృద్ధి యోజనా కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ముస్లిం మహిళపై త్రిపుల్ తలాక్ పేరుతో జరుగుతున్న అన్యాయాన్నికి గురయ్యారని, త్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి వారికి గౌరవాన్ని కల్పించారని అన్నారు. నీచమైన రాజకీయ నాయకులు కొందరు మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని, ఇటువంటి ఘటన వారం రోజుల క్రితం పక్క జిల్లా నిర్మల్‌లో జరిగిందన్నారు. ప్రభుత్వం మహిళలకు 33 శాతం శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, గొప్ప గొప్ప మహిళలు అనేక రంగాలలో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో మార్పు తీసుకురావాలని తెలిపారు. రాజకీయ పరంగా, వ్యాపార పరంగా ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని పిలుపు నిచ్చారు. అనంతరం మహిళలను సన్మానించారు



పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

స్త్రీ పురుష సమానత్వం కోసం పోరాడుదాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ గర్ల్స్ హాస్టల్లో పిడిఎస్ యూ ఆధ్వర్యంలో వంట చేసే మహిళలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యూ యూనివర్సిటీ కార్యదర్శి జయంతి మాట్లాడుతూ మహిళలు కుటుంబ పోషణ కోసం ఇంట్లో, బయట ఎంతో కష్టపడుతున్నారని, పనిచేసే చోట ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని అన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారాని , పనికి సమానంగా మహిళలకు వేతనాలు ఇవ్వాలని, యూనివర్సిటీలో పనిచేసే మహిళలను రెగ్యులర్ చేయాలని, సమాజంలో మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పిడిఎస్‌యూ సభ్యులు నవ్య, అనూష, బిందు, తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సన్మానించిన పీడీఎస్‌యూ నాయకులు

60 మంది మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పిఆర్‌టియూ ఆధ్వర్యంలో జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మండల అధ్యక్షులు ఇట్టాం గోపాల్ అధ్యక్షతన అర్బన్, రూరల్ ఆలూరు మండలాలకు చెందిన 60 మంది ఉపాధ్యాయినిలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పీఆర్టీయూ అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, ముఖ్యఅతిథిగా డాక్టర్ శ్రీలత, ఎంఈఓ పింజ రాజగంగారం తదితరులు పాల్గొన్నారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్, పిఆర్‌టియు పత్రికా సంపాదకులు పెంట జలంధర్, పిఆర్టియు డివిజన్ ఇంచార్జి ప్రవీణ్ రెడ్డి, అర్బన్ అధ్యక్షులు రవికుమార్, ఆలూర్ అధ్యక్షులు అశ్వక్ హైమద్, అర్బన్ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, రూరల్ ప్రధాన కార్యదర్శి సంగేమ్ అశోక్, సౌడ సంతోష్, స్టేట్ అసోసియేట్ స్ జీ శ్రీనివాస్ గీతాంజలి, మధు పరిమళా వాణి అర్బన్ సెక్రటరీ కవిత మండల సెక్రెటరీ కవిత రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మండల అసోసియేట్ నరసింహ రెడ్డి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నయ్య. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉద్యోగులపై హరీష్‌రావు వ్యాఖ్యలు సరికాదు

- ఎస్‌టియుటిఎస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైతు బంధు డబ్బులు ఆపి ఏసి రూమ్‌లో కూర్చునే ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు చెల్లించింది అంటూ గురువారం మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికోసం నిరంతరం పాటు పడుతున్న ఉద్యోగులను ఇది అవమానించడమే అని ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఏ ఎస్ ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి చీమల శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బంధుకు తాము వ్యతిరేకం కాదని, కానీ రైతులకు ఉద్యోగుల జీతాలకు సంబంధం ఏంటని వారు ప్రశ్నించారు. గతంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల జీతాల పై దుష్ప్రచారం చేసి ప్రజల్లో ఉద్యోగుల పట్ల వ్యతిరేకత తీసుకొచ్చే ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు కూడా అలాగే ఉన్నాయని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించటంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని తెలిపారు. కొద్ది మంది పైస్థాయి ఉద్యోగులు మాత్రమే ఏసి రూములో కూర్చుని పని చేస్తారని, మెజారిటీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో, ఆఫీస్‌లో, పాఠశాలల్లో కనీస వసతులు లేని పరిస్థితుల్లో పనిచేసే విషయాన్ని మాజీ మంత్రి గుర్తించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం జీతాలు ఆలస్యంగా చెల్లించటం మూలంగా బ్యాంక్ లోన్లు సమయానికి కట్టలేక ఫైన్ చెల్లించామని, ప్రస్తుత ప్రభుత్వం దానిని సరిచేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు ఇలా ప్రజలను ఉద్యోగుల పైకి ఉసిగొల్పి ప్రయోజనం పొందాలనుకోవటం బాధాకరమని, ఇకనైనా ఇలాంటి మాటలు మానుకోవాలని హితవు పలికారు..

సమస్య ఎప్పుడు పరిష్కారమయ్యేనో?

- సెక్రెటరీకి ఉత్తరం పంపిన పైఅధికారులు
- అయినా పట్టించుకోవడంలేదంటున్న బాధితులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గత సంవత్సరం జూన్ 12న కలెక్టర్ కార్యాలయంలో నందిపేట్ మండలం చింరాజ్ పల్లి బాధితులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నివాసం కోసం స్థలాన్ని కేటాయించగా ఆ స్థలంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నప్పుడు కొందరు ఇబ్బంది పెట్టారని అన్నారు. అయినా ఇప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. నేటికీ బాధితులు సమస్య పరిష్కరించాలంటూ పలుమార్లు అధికారులను కలిశారు. దానిపైన బాధితులు డిపిఓ, డిఎల్పిఓ అధికారులకు ఫిర్యాదు చేశారు. పైఅధికారులు సమస్యను పరిష్కరించాలంటూ పంచాయతీ సెక్రెటరీ ఉత్తరం పంపినప్పటికీ, ఇప్పటికీ సమస్యను పరిష్కరించలేదు. పంచాయతీ సెక్రెటరీ అక్కడి ప్రజాప్రతినిధులకు వత్తాసు పలుకుతూ ప్రజలకు న్యాయం చేయడం లేదని, అది ప్రభుత్వ స్థలం, ఆ స్థలం వ్యవసాయంకోసం కేటాయించే స్థలం. ఆ స్థలం (సర్వే నెంబర్ 40/7/1) కొందరు వ్యక్తులు భవనాలు నిర్మించుకున్న, వారిపైన ఎటువంటి చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్టుగా పంచాయతీ సెక్రెటరీ వ్యవహరిస్తున్నారని బాధితులు ఇప్పటికీ ఆరోపణ చేస్తూనే ఉన్నారు. వారి నుండి ఎంతోకొంత లాభాన్ని పొందడంతో భవన నిర్మాణం చేసే వారిని ఏమి అనకుండానే సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ సర్వే నెంబర్ 40/7/1 విషయం లో డిపిఓ, డిఎల్పిఓ పర్యవేక్షణ చేసి పూర్తి విచారణ చేసి, ఆ స్థలం ప్రభుత్వ భూమినా..., లేక ప్రైవేట్ వ్యక్తులదేనా అనే సమాచారాన్ని గత సంవత్సరం అక్టోబర్ నెలలో మెమోను సెక్రెటరీకి చేరవేశారు. కానీ ఆ సెక్రెటరీ మా వద్దకు ఎటువంటి పత్రాలు రాలేదని బాధితులకు చెబుతున్నారు. ఇదంతా ఒకవైపు జరుగుతుంటే పంచాయతీ సెక్రెటరీ మాత్రం ఈ ప్రాంతానికి 'నేనే రాజు... నేనే మంత్రి...' అనే చందంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించకుండా..., ఉన్నతాధికారుల మాటలను పట్టించుకోకుండా..., బేఖాతరు చేస్తున్నారు అని పలువురు ఆరోపణ చేస్తున్నారు. అయినా ఆ స్థలం ప్రభుత్వ స్థలం అయినప్పటికీ పలువురు కమర్షియల్ భవనాలను నిర్మిస్తున్న పంచాయతీ సెక్రెటరీ ఏ విధంగా అనుమతించారని వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారింది. ఇదంతా జరుగుతున్న ఇప్పటివరకు ఆయనకు ఎటువంటి సమాచారం డిపిఓ, డిఎల్పిఓ కార్యాలయాలనుండి అందలేదు అనడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని, ఆ ప్రజాప్రతినిధుల దగ్గర ఎంతవరకు ఒప్పందం కుదుర్చుకున్నాడని పై అధికారులు కూడా విమర్శలు చేస్తున్నారు. అధికారులు ఆ పంచాయతీ సెక్రెటరీపైన చర్యలు తీసుకోవడం తప్పదని అధికారులు అంటున్నారు. సమస్యను ఎప్పుడు పరిస్కరించి, ఆ అధికారిపై చర్యలు ఎప్పుడు తీసుకొని, ఆ సామాన్యులకు న్యాయం ఎప్పుడు చేస్తారో వేచి చూడాల్సిందే.


గ్రామశివారులో నిర్మాణం చేపడుతున్న కమర్షియల్ కాంప్లెక్స్

యాచకురాలిపై వాలంటీర్ వీరంగం

- మహిళను చితకబాదిన వాలంటీర్
- బాధ్యులపై కేసు నమోదు చేస్తారా.. లేదా.. అనేది ప్రశ్నార్థకం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ నీలకంఠేశ్వర ఆలయం వద్ద దారుణ ఘటన చోటు చేసుకుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఒక వాలంటీర్ మహిళను చితకబాదిన ఘటన నీలకంఠేశ్వర ఆలయం వద్ద చోటుచేసుకుంది. అయితే చితకబాదిన విషయంలో పోలీసులు కేసు నమోదు చేస్తారా.. చేయరా.. అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. స్థానికుల సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శివరాత్రి సందర్భంగా ఆలయ పరిసరాల్లో యాచించేందుకు వచ్చిన ఓ మహిళను ఆలయానికి సంబంధించిన ఓ వాలంటీర్ విచక్షణా రహితంగా కొట్టాడని తెలిసింది. దాంతో మహిళకు వాతలు వచ్చాయి. శివరాత్రిని పురస్కరించుకొని ఆలయ కమిటీ వారు వాలంటీర్లను నియమించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఓ యాచక మహిళ అక్కడికి భిక్షాటనకు రాగా ఆమె వాలంటీర్ భక్తుల మధ్యకు వచ్చిందని వాతలు పడేలా చితకబాదాడు. ఈ ఘటనపై ఆలయ అధికారులు నోరు మెదపకపోవడం గమనార్హం అంటున్నారు. అయితే అసలు ఏం జరిగింది ఏంటి అని పోలీసు వర్గాలు తెలిపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ ఎవరు కూడా ఇప్పటివరకు చెప్పక పోవడంపై అసలు అక్కడ ఏం జరిగిందో అనేది ఒక ప్రశ్నర్థకంగా మిగిలింది.

2లక్షల40వేల ఎల్‌ఓసీ అందజేత

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని పురానిపేట్ గ్రామానికి చెందిన సుంకరి లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్నారు ఆమె హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్లో వైద్యంకోసం చేరింది. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌ను సంప్రదించగా ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2లక్షల 40వేలు రూపాయల ఎల్ఓసిని అందించారు. కుటుంబీకులు ఆయకు కృతజ్ఞతలు తెలిపారు.



కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ (డి) సహకార సొసైటీ డైరెక్టర్ బొక్క గంగాధర్, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి మురళి గౌడ్, తదితరులు బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో మాజీ ఎంపిటిసి చింతల కిషన్ అధ్వర్యంలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రత్యేక కృషి చేస్తామని వారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మూడు నెలల కాక ముందే అమలు చేశారని, రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, సీనియర్ నాయకులు బోర్వెల్ రాజేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వాహనం బోల్తా.. ఒకరు మృతి

నవతెలంగాణ-బాల్కొండ

అతివేగంతో అజాగ్రత్తగా వాహనం నడపడం వల్ల అదుపుతప్పి బోల్తాపడడంతో ఒకరు మృతి చెందారని ఎస్సై కే గోపి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున ఎన్ హెచ్ 44 బాల్కొండ శివారులోని నాగులకుంట వద్ద రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. వాహనం బోల్తా పడడంతో అందులో ఉన్న జితేంద్రకుమార్ చౌదరి (23) తలకి, ఇతర చోట్ల బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం నిజామాబాద్ తీసుకెళుతుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఈ వాహనం హైదరాబాద్ నుండి ఇచ్చోడకు కంఫోర్ట్ మెటీరియల్ ట్రాన్స్‌పోర్ట్ చేస్తుండగా ఘటన చోటుచేసకుంది. మతునికి బంధువైన మనీదీప్ చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కే .గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సిమెంట్ బెంచీలు వితరణ

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని జల్లపల్లి ఫారం గ్రామంలో ఎంఏ హకీమ్ తాన పుట్టిన ఊరికి సేవచేయాలనే తపనతో గ్రామస్తులు బస్సు కోసం రోడ్డుమీద నిలబడి ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకొని.. గ్రామానికి 10 సిమెంట్ బెంచీలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సిమెంట్ బెంచీలను వితరణ చేసిన హకీమ్‌ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, సజ్జాద్, మైను పటేల్, దేవ్‌సింగ్, వాజిద్, బాబా, ధను తదితరులు పాల్గొన్నారు.



బెంచీలు వితరణ చేస్తున్న దృశ్యం

జీరో కరెంటు బిల్లులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో ఉచిత విద్యుత్‌లో భాగంగా అర్హులైన లబ్దిదారులకు జీరో కరెంట్ బిల్లులను విద్యుత్ శాఖ అధికారులతో కలిసి మాజీ సర్పంచ్ లక్షెట్టి సాయిలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ విద్యుత్ అధికారులు తిరిగి జీరో బిల్లులను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లక్షెట్టి సాయిలు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆరుగ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టి అమలుపర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులలు, నాయకులు పాల్గొన్నారు.



జీరో కరెంటు బిల్లులు పంపిణీ చేస్తున్న నాయకులు

మామిడి పంటకు తెగుళ్లు

- రాలిపోతున్న మామిడి పిందెలు
- లబోదిబోమంటున్న రైతులు
- పత్తాలేని ఉద్యానవన శాఖ అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మామిడి చెట్లకు మాయ రోగంసోకింది. దాంతో పూత కాయకపోవడంతో కాత సైతం సరిగా పట్టలేదు. మామిడి తోటలే ఆధారంగా జీవిస్తున్న రైతులు లబోదిబోమంటున్నారు. ఉద్యానవనశాఖ అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోవడం లేదని రైతుల నుంచి వస్తున్న ఆరోపణలు. మండలంలో సుమారు 1200 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ప్రతియేటా మామిడి కాయల దిగుబడి బాగుండేది. ప్రస్తుతం మాయరోగంతో రైతులు ఆశలు అడియాసలయ్యాయి. చెట్టు ఆరోగ్యంగా కన్పిస్తున్నా బుడిద తెగుళ్ల వచ్చాయి. పూత వచ్చినప్పటికీ.. బుడిద తెగుల్లు సోకడంతో పూతతో పాటు, మామిడికాయ పిందెలు రాలిపోతున్నాయి. తద్వారా రూ.లక్షల్లో మామిడి పంట నష్టం వాటిల్లుతోందని రైతులు చెబుతున్నారు.



పూత పెరిగినా.. కాత లేని మామిడి చెట్టు

పత్తాలేని అధికారులు..

సలహాలు, సూచనలు చెప్పే ఉద్యానవన అధికారులు పత్తాలేరని రైతులు ఆందళన చెందుతున్నారు. పండ్ల తోటలకు సంబంధించి గతంలో ప్రత్యేక శాఖగా ఉద్యానవన శాఖ కొనసాగుతుండేది. ప్రస్తుతం ఆ శాఖ కనుమరుగైపోవడంతో నాలుగైదు మండలాలకు కాంట్రాక్ట్ బెసిక్ మీద చాలీచాలని సమయానికి జీతాలు రాని హర్టికల్చర్ అధికారులు వెల్లదీస్తున్నారు. ప్రస్తుతం వారిని సంప్రదించాలంటే మొబైల్ నెంబర్లు సైతం అందుబాటులో లేవని రైతులు చెబుతున్నారు. రైతులు నేరుగా పెస్టిసైడ్ దుకాణాల వారికి సంప్రదించి సమస్యలు తెలియచేస్తే వారు చెప్పిన రసాయన మందులను ఇచ్చినవి మామిడి పంటకు పిచికారీ చేస్తున్నారు. మామిడి పంటను రక్షించుకునేందుకు ఎకరాకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నామని అంటున్నారు. ఎకరంలో నాటిన మామిడి పండ్లను గతేడాది లక్ష రూపాయల పైచిలుకు దళారులు కొనుగోలు చేశారు. కేజీ మామిడి పండ్లు రూ.80 నుంచి 120 ధర పలికింది. ఈ సంవత్సరం పంట సాగు పెరిగినప్పటికీ పూత కాత లేక ఎకరానికి రూ.10వేలు కూడా వచ్చేలా లేవని రైతులు వాపోతున్నారు.



తెగుల్లు సోకడంతో నేలరాలిన మామిడి పిందెలు

దిగుబడి తగ్గే అవకాశం..

ఈ సారి మామిడి చెట్లకు తెగుళ్ల వలన దిగుబడి తగ్గే అవకాశం ఉంది. మార్కెట్‌లో మామిడపండ్ల రేట్లు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. పచ్చడిలకు, చట్నీలకు ఎక్కువ ధర పెట్టి కొనుక్కోవాల్సిందేనని వ్యాపారస్తులు చెబుతున్నారు.

వాతావరణంలో మార్పు కారణం..

వాతావరణంలో సంభవించిన మార్పు కారణంగా అకాల వర్షం, ఎండలు తగ్గుముఖం పట్టి చలి తీవ్రత డిసెంబర్ 23 సంవత్సరంలో అమాంతంగా పెరగడంతో తెగుళ్ల సోకి మామిడి పంటకు భారీగా నష్టాన్ని మిగిల్చిందని పలువురు అంటున్నారు.

తోట సందర్శన..

నాగల్‌గావ్ గ్రామంలో సాలే వీరేశం అనే రైతు తోటను నవతెలంగాణ సందర్శించిగా.. మామిడి తోటలో సోకిన తెగుళ్లను రైతు చూపించారు. జరుగుతున్న నష్టం వివరాలను తెలియజేశారు. వాస్తవంగా క్షేత్ర స్థాయిలో పరీశీలిస్తే మూడు ఎకరాలలో 242 చెట్లు సాగుచేస్తే 20 చెట్లకు మాత్రమే మామిడి పిందెలు కాశాయి. మిగతా చెట్లకు పిందెలు కాసినా.. రాలిపోయాయి. కొన్నింటికి పూత కూడా రాలిపోయింది.

ఎకరాకు 30-50 వేల వరకు ఖర్చు చేశాం

- రైతు వీరేశం.



మామిడి తోటకు ఎకరానికి రూ.30-50వేల వరకు ఖర్చు చేశాం. నీరు పారించేందుకు కూలీతో పాటు రసాయన ఎరువులు, మందుల పిచికారీతో పెట్టుబడి భారీగానే అయ్యింది. ప్రస్తుతం తెగుళ్ల సోకడంతో లక్షల్లో నష్టం వాటిల్లే అవకా శం ఉంది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి.

పనుల్లో నాణ్యత లోపించొద్దు

- ఎమ్మెల్యే తోటలక్ష్మి కాంతారావు
- పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పనుల్లో నాణ్యత లోపించొద్దని ఎమ్మెల్యే తోటలక్ష్మి కాంతారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కొరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు కావడంతో ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విద్యా కోసం అధిక ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. అందులో భాగంగానే ప్రహరీగోడ నిర్మాణం కొరకు రూ.32 లక్షల 58వేలు, వంట గదుల కోసం రూ.8లక్షల 80వేలు, మరుగుదొడ్ల కొరకు రూ.7లక్షల91వేలు మంజూరైనట్టు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, మోహన్, శ్యామప్ప పటేల్, సంజీవ్, కల్లూరి పండరీ, వినోద్, రాంసింగ్, హన్మాండ్లు, బచ్చన్, రసీద్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళల సామాజిక బాధ్యత' చర్చా గోష్టిని విజయవంతం చేయండి

- టీపీటీఎఫ్ మహిళా విభాగం ప్రతినిధులు



మాట్లాడుతున్న మహిళా ప్రతినిధులు

నవతెలంగాణ-కామారెడ్డి

శ్రామిక మహిళ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న నిర్వహిస్తున్న 'మహిళల సామాజిక బాధ్యత' చర్చా గోష్టిని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ మహిళా విభాగం ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మహిళలు సామాజిక బాధ్యత అనే అంశంపై చర్చ గోష్టి కార్యక్రమాన్ని పాత రాజంపేట్‌లో గల లేపాక్షి హెూమ్స్‌లో గల కమ్యూనిటీ హాలులో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. మహిళా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్ర ఆనంద్, డాక్టర్ తేజస్విని, డాక్టర్ రవళి హాజరవుతారని టిపిటిఎఫ్ మహిళా విభాగం ప్రతినిధులు ఎన్.నలిని దేవి, మీనా భూషణ్, సిహెచ్.లక్ష్మి, విజయ శ్రీ తెలియజేశారు.

పాదయాత్ర భక్తులకు పండ్లు, ఆహారం పంపిణీ



పండ్లు, ఆహారం పంపిణీ

నవతెలంగాణ-మద్నూర్

మహారాష్ట్రలోని కందార్ తాలూకా ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో గల అప్పగారి మఠానికి ప్రతి సంవత్సరం పాదయాత్ర ద్వారా మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో మహాశివరాత్రి రోజున బిచ్కుందకు చేరుకుంటారు. ఈ పాదయాత్రను 13 ఏళ్లుగా వారు కొనసాగిస్తున్నారు. అయితే మండలంలోని మేనూర్ గ్రామానికి చెందిన ఇటుక బట్టి వై.గోవింద్ తన ఇటుక బట్టి వద్ద మహారాష్ట్ర పాదయాత్ర భక్తులకు పండ్లు, అల్పాహారాన్ని 13 ఏళ్లుగా అందిస్తున్నారు. దీంతో ఆ భక్తులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నారు. అల్పాహార కార్యక్రమానికి మేనూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ విట్టల్ గురుజీ, ఉప సర్పంచ్ మోహన్, ఆ గ్రామ ఎంపిటిసి సభ్యులు మందాకిని శ్రీనివాస్‌గౌడ్, ధూప దీప నైవేద్య పూజారుల సంఘం జిల్లా అధ్యక్షులు అంజన ప్ప, ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా పోరాడుదాం



మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ నాయకురాలు నాగమణి

నవతెలంగాణ-బోధన్

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక తీరుకు నిరసనగా పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం బోధన్ పట్టణ అధ్యక్షురాలు నాగమణి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేడు దేశంలో మోడీ ప్రభుత్వం అనుసరించే మతోన్మాద, ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా మహిళలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కులను, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు బీభాషా బేగం, రిహానా బేగం, అరుణ, విజయ, మల్లమ్మ లక్ష్మీ యాదమ్మ, గంగామణి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు అందజేస్తున్న ప్రతినిధులు

నవతెలంగాణ-పిట్లం

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు మరగల వేణు అన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్ర గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వారి స్థాయికి మించి ప్రజలకు సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా వెంచర్లు



వెంచర్‌లో తాగిపడేసిన మద్యం బాటిళ్లు..

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలో మందుబాబులకు మద్యం సేవించడానికి వెంచర్లు అడ్డాగా మారుతున్నాయి. రాత్రి సమయంలో మందుబాబులు సమీప వెంచర్లలో మద్యం సేవిస్తున్నారు. అనంతరం మద్యం బాటిల్లను అక్కడే పగులగొట్టి వెళుతున్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరమని తెలిసినా విచ్చలవిడిగా వెంచర్లను ఆసరాగా చేసుకొని మందుబాబులు జల్సా చేస్తున్నారు. రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఉన్న వెంచర్లలో సమీపంలో నివసిస్తున్న కాలనీవాసులకు ఉదయం వేళ వెంచర్లలో మందుబాటిల్స్ దర్శనమిస్తున్నాయి. అలాగే జాతీయ రహదారి పక్కన ఉన్న వెంచర్లు, పల్లె ప్రకృతి వనాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలల్లో విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. పోలీసులు సాయంత్రం, రాత్రి సమయంలో తనిఖీలు చేసి వెంచర్లు, పాఠశాలలో మద్యం సేవిస్తున్న మందుబాబులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి



నవతెలంగాణ-ఎడపల్లి

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్ర పరిధిలోని పెద్ద చెరువులో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రెంజల్ లింగయ్య (36) అనే యువకుడు గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో చేపల వేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కాగా శుక్రవారం తెల్లవారుజామున శవం బయటపడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య రేఖ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కబ్జా కోరల్లో పాఠశాల స్థలం

- నిలిచిపోయిన పాఠశాల కాంపౌండ్ వాల్
- గ్రామస్తుల్లో వ్యతిరేకత
- పల్లె ప్రకృతి వనం చెట్లు నరికివేత

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని పెద్దశక్కర్గ గ్రామంలో గల పాఠశాల స్థలం కబ్జా కోరల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. పాఠశాలకు కాంపౌండ్‌వాల్ నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.16 లక్షల 50వేలు మంజూరు కాగా ఆ నిధులతో పాఠశాలకు కాంపౌండ్‌వాల్ నిర్మాణం ప్రారంభించారు. అయితే గ్రామస్తుల్లో వ్యతిరేకత రావడంతో కాంపౌండ్‌వాల్ నిర్మాణం పనులు నిలిచిపోయాయి. పెద్దశక్కర్గ పాఠశాలను నవతెలంగాణ బుధవారం సందర్శించగా ఆ పాఠశాల సమస్యలో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాల ఆవరణలో గత ప్రభుత్వాలయంలో పల్లెప్రకృతి వన కేంద్రం ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. పాఠశాల కాంపౌండ్‌వాల్ నిర్మాణంలో భాగంగా పల్లెప్రకృతి వన కేంద్రానికి చెందిన చెట్లను నరికివేతకు గురైంది. పల్లెప్రకృతి వనానికి చెందిన చెట్ల నరికివేత గురించి ఆ పాఠశాల హెచ్ఎం మారుతిని అడిగితే చెట్ల నరికివేతలో తన ప్రమేయం ఏమీ లేదని సమాధానం ఇచ్చారు. చెట్ల నరికివేత గురించి ఆ గ్రామ కార్యదర్శికి నవతెలంగాణ ఫోన్ ద్వారా వివరణ కోరెందుకు ప్రయత్నించగా ఫోన్‌కాల్‌ను స్వీకరించకపోవడం గమనార్హం. పాఠశాలకు మొత్తం రెండెకరాల 10 గుంటల భూమి ఉన్నట్టు ఆ పాఠశాల హెచ్ఎం తెలిపారు. పాఠశాలకు చెందిన భూమి రికార్డులు పాఠశాలలో లేవని హెచ్ఎం తెలిపారు. పాఠశాలకు సంబంధించిన భూమిని ప్రభుత్వపరంగా సర్వే చేస్తే, చుట్టుపక్కల ఏర్పాటు చేసిన అంగన్వాడీ స్థలం, అలాగే రైతు వేదిక, ఇతరత్రా కొన్ని రకాల కుల సంఘాలకు చెందిన స్థలాలు ఉండటం ఈ పాఠశాల కాంపౌండ్‌వాల్ నిర్మాణంలో అన్ని రకాల సమస్యలు ముందుకు రావడం, గ్రామస్తుల్లోనే వ్యతిరేకత ఏర్పడడం వల్ల ప్రభుత్వ పరంగా మంజూరైన పాఠశాల కాంపౌండ్‌వాల్ నిధులు వెనక్కి వెళ్లే ఆస్కారం ఉన్నట్లు పాఠశాల హెచ్ఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనా పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం ఒకపక్క నిలిచిపోగా.. మరోపక్క పల్లె ప్రకృతివనానికి చెందిన చెట్లను నరకడంతో ప్రజల్లో అయోమయం నెలకొంది. గ్రామస్తులంతా కలిసి పాఠశాల సమస్య వెంటనే పరిష్కరించేలా ఓ నిర్ణయం తీసుకుంటే నిధులు వెనక్కి వెళ్లే ఆస్కారం ఉండదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నిలిచినపోయిన కంపౌండ్ వాల్ నిర్మాణ పనులు

ఘనంగా మహిళా దినోత్సవం

- ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్/కామారెడ్డి

మండలంలోని పెద్దగుల్లా గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగులైన ప్రభుత్వ ఎంపియూపీఎస్ తెలుగు మీడీయం, ఎంపీపీఎస్ ఉర్దూ మీడీయం ఉపాధ్యాయులు, హెల్త్‌వర్కర్స్, అంగన్‌వాడీ టీచర్స్ ఆయాలకు గ్రామస్తుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతార్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఉర్దూమీడీయం హెచ్ఎం సమీనాబేగం, ఎంపియూపీఎస్ ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ.. మహిళలకు అవకాశం కల్పిస్తే అన్ని రంగాలలో ముందుంటారని తెలిపారు. ఇందుకు సహకరించిన జీపీ కార్యదర్శి చందుకు ప్రత్యేత ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, లత, సునీత, హెల్త్ వర్కర్స్, ఉపాధ్యాయినీలు, హెచ్ఎం సంగ్రాం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం



జుక్కల్ : పెద్దగుల్లాలో మహిళ ఉద్యగులకు సన్మానం

వృద్ధాశ్రమంలో మహిళా దినోత్సవం..

కామారెడ్డి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కామారెడ్డి శివారులో ఉన్న వృద్ధాశ్రమంలో, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు హారం శారదను సహాయకురాలు లక్ష్మిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు పోలబోయిన సత్యం మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకురాల్లను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, కోశాధికారి తోర్నాల సుధాకర్, సభ్యులు సబ్బని హరికృష్ణ, మర్కంటి కృష్ణమూర్తి, ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం..

కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న మహిళా పోలీస్ అధికారులు నాగలక్ష్మి, గోదావరి, లావణ్య, రజిత, కళ్యాణిని పోలీస్ స్టేషన్ తరపున అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీరామ్, ఇంద్రసేనారెడ్డి, అనిల్, ఏఎస్ఐ రాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో..

విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు రంగ్యానాయక్ మాట్లాడుతూ.. సంఘం ఆదేశాల మేరకు రోజువారి కూరగాయలు, ఆకుకూరలు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న బానాల వజ్రవ్వ మహిళా దివ్యాంగురాలికి మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సబ్ కమిటీ వైస్ చైర్మన్ నితీష్‌రెడ్డి, బంటు స్వామి, బంజరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి సంక్షేమ సేవ సమితి అధ్యక్షులు మ్యాక మోహన్ దాస్, సంఘం అధ్యక్షులు వేముల ప్రకాశ్ పద్మశాలి మహిళలను శుక్రవారం శాలువా మెమోంటోలతో సన్మానించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంక్షేమ సేవ సమితి అధ్యక్షులు మ్యాక మోహన్ దాస్ మాట్లాడుతూ.. ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వాన్ని సాధించడానికి మహిళలను ప్రోత్సహించాలని, మహిళలకు సమాజంలో సమాన హక్కులు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వేముల ప్రకాశ్, కార్యదర్శి సురుకుట్ల భూమేశ్వర్, అందె నాగేశ్వర, గుడ్ల దేవేందర్, మాదసు నర్సింహులు, ఈరవత్రీ రాందాస్, సరుకుట్ల రమేష్, పొన్న ప్రవీణ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ మహిళ వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

సీపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాస్

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి, సాధించుకున్న హక్కులను కాపాడుకుందామని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు పిలుపునిచ్చారు. 114వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మామిడిపల్లి లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దాసు మాట్లాడుతూ భారత మాతా కీ జై, బేటి పడావో బేటి బచావో అంటూ నరేంద్ర మోడీ నినదిస్తూనే ప్రతిరోజు వందలాది ఆడపిల్లల ఉసురుపోసుకుంటున్నార ని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రేమోన్మాదంతో దాడులు నిత్య కృత్యం అయ్యాయని ఆయన తెలిపారు. 33 శాతం రిజర్వేషన్ అమలు ఎప్పుడని పాలకులను ప్రశ్నించారు. వరకట్న దురాచారాలను, అశ్లీల సాహిత్యాన్ని నిర్మూలించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా సంఘం నాయకురాలు లలిత, నాయకులు గంగక్క, నరసవ్వ, లక్ష్మి, కాలేదా, షహదా, ఫాతిమాభెగం, కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చైతన్యవంతులుగా ఉండాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి
- ఉత్సాహాన్ని నింపిన అల్ఫోర్స్ ప్రథమోత్సవ్



నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన ఉండడమే కాకుండా వాటిలో పాల్గొని సమాజంలో చైతన్యవంతులుగా ఉండాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా? వి. నరేందర్ రెడ్డితో కలసి స్కూల్ ఆవరణలో "ప్రథమోత్సవ్" పేరుతో గురువారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో కళల పట్ల ఆసక్తిని కనబర్చాలని వాటిలోని విషయాలను విశ్లేషణ చేయడమే కాకుండా సమగ్రంగా తెలుసుకొని ఆకర్షింపజేసే విధంగా ప్రదర్శించాలని తెలిపారు. కళలు, సంస్కృతి కార్యక్రమాల పట్ల నైపుణ్యం కలిగి ఉండాలని తద్వారా సమాజంలో ఉత్తమ గుర్తింపుతో ఉంటామని చెప్పారు. విద్యార్థులు సంస్కృతి వైభవం పట్ల అధ్యయనం చేసి వాటిలోని విషయాలను అవలంభింపజేసి స్ఫూర్తి పొందాలన్నారు. డా.వి.నరేందర్ రెడ్డి అత్యుత్తమ విద్యావేత్త అని వారి సారధ్యంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలను పాటిస్తూ ఉత్తమ విద్యను అందిస్తూ తెలంగాణ రాష్ట్రం లోనే తలమానికంగా నిలిచారన్నారు. విద్యాసంస్థల అధినేత డా. డా.వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో నేర్చుకున్న విషయాలు చాలా ప్రభావం చుపుతాయని, ఉపాధ్యాయులు నిర్దేశించిన విషయాలను ఎప్పటికప్పుడు సాధనచేసి నవిజయాల వైపు పయనించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలను సాధించడమే కాకుండా ఐఐటి, ఎన్ఐటి, మెడికల్ సీట్లను సాధిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన "రైతుల" కష్టాలను తెలుపుతూ , " ఆర్మీ ", "సేవ్ గర్ల్స్.... " నత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలువురు విద్యార్థులు ఆలపించినటువంటి గేయాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. వార్షిక ప్రణాళికలో భాగంగా అద్భుతంగా రాణించిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

పీడీఎస్ రవాణా వయా నవీపేట్

- ఆగని అక్రమ పిడిఎస్ బియ్యం రవాణా
- పేదల బియ్యం దళారుల పాలు
- చౌక దందాలో పెరుగుతున్న దళారులు..
- రేషన్ షాపుల వద్ద యథేచ్ఛగా కొనుగోలు
- మామూళ్ల మత్తులో యంత్రాంగం
- మీడియాది అదే దారి..
- చౌక దందాకు చెక్ పడేదెప్పుడు?

నవతెలంగాణ-నవీపేట్

నిజామాబాద్ జిల్లాలో పిడిఎస్ రవాణాకు వయా నవీపేట్ గా మారింది. మహారాష్ట్ర పొరుగు మండలం కావడంతో అర్ధరాత్రి పూట డీసీఎంలు, బొలెరో వాహనాల్లో యథేచ్ఛగా రవాణా సాగుతున్న ప్రభుత్వ యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తుంది. ప్రభుత్వం మారిన పిడిఎస్ బియ్యం రవాణా మాత్రం ఆగడం లేదని పలువురు వాపోతున్నారు. పేదలకు పంపిణీ కావలిసిన ప్రజా పంపిణీ బియ్యం అక్రమార్కులకు ఆదాయపు వనరుగా మారింది. రైస్ మిల్లర్ల అక్రమ సంపాదనకు దళారులు తోడవడం వారికి ప్రభుత్వ యంత్రాంగం సైతం తోడవడంతో చౌక దందాతో కాసులు సంపాదిస్తున్నారు.

పౌర సరఫరా శాఖ ద్వారా అందిన బియ్యాన్ని బయట మార్కెట్లోకి రైస్ మిల్లర్లు అమ్ముకొని పిడిఎస్ బియ్యాన్ని కొనుక్కొని రీసైక్లింగ్ చేస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. వారికి దళారులు తోడవడంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా దందా కొనసాగుతుంది. దీంతో దళారుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది.

మామూళ్ల మత్తులో యంత్రాంగం..
మీడియాది అదే దారి..

పేదలకు పంపిణీ కావాల్సిన బియ్యం అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ అక్రమార్కులకు పౌరసరఫరాల, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగంతో పాటు



కూలిన శివాలయం పిల్లర్లు



పట్టుకున్న పీడీఎస్ బియ్యం వాహనం

ప్రశ్నించాల్సిన కొందరు మీడియా ప్రతినిధులు సైతం మామూళ్ల మత్తుకు అలవాటు పడడంతో యథేచ్ఛగా రేషన్ షాప్‌ల వద్ద కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసుకుని స్థానికంగా ఇండ్లు అద్దెలకు తీసుకొని డంపు చేసుకుంటూ అర్ధరాత్రి పూట రవాణా చేస్తున్నారు. పేదల వద్ద 15 నుండి 20 రూపాయల వరకు కిలో బియ్యం తీసుకుని మిల్లర్లకు లేదా మహారాష్ట్రకు తరలించి దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం పర్యవేక్షించాల్సిన పౌరసరఫరాల అధికారులు మాత్రం అప్పుడప్పుడు ఫిర్యాదులు వచ్చినప్పుడు డీలింగ్ జరుపుకొని నామమాత్రంగా పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకొని కేసులు నమోదుచేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. గతంలోని పోలీసు అధికారి అండ ఉండడంతో అర్ధరాత్రి పూట నందిపేట్ రోడ్డులో పెట్రోల్ బంక్ ఎదుట గల శివాలయాన్ని అక్రమంగా అర్ధరాత్రి పూట రవాణా చేస్తున్న పిడిఎస్ వాహనం ఢీకొనడంతో వాహనం టైర్లు పేలిపోయి ఆలయం పిల్లర్ సైతం పడిపోయి ధ్వంసం అయింది. దీంతో రాత్రికి రాత్రే కొందరు మీడియా ప్రతినిధుల సహకారంతో పెద్ద క్రేనుతో బొలెరో వాహనాన్ని తరలించి కేసు లేకుండా చేసుకున్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల అండదండలు పిడిఎస్ మాఫియాకు ఉండడంతో వారికి అడ్డు అదుపు లేకుండా పోయింది. ప్రభుత్వం మారిన పిడిఎస్ బియ్యం రవాణా మాత్రం తగ్గడం లేదు.

మండల కేంద్రంలోని సుభాష్ నగర్ లో బుధవారం రాత్రి అక్రమంగా బొలోరో వాహనంలో పిడిఎఫ్ బియ్యం వేస్తుండగా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. కానీ కేవలం ఎనిమిది క్వింటాళ్ల బియ్యం మాత్రమే పట్టుకున్నట్లు కేసు నమోదు చేయడం పట్ల పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పేదలకు అందాల్సిన బియ్యం చౌక ధరల దందాకు చెక్ పెట్టి అక్రమ దందాలకు ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు భావిస్తున్నారు.

అక్రమ దందా ఆగదా?

నాయక్ వాడి శ్రీనివాస్, సిపిఎం మండల కార్యదర్శి



గత ప్రభుత్వ హయాంలో ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసి సొంత ప్రయోజనాల కోసం అప్పటి నాయకులు పిడిఎస్ అక్రమ రవాణాను ప్రోత్సహించడంతో అధికార యంత్రాంగం సైతం మామూలు తీసుకొని చోద్యం చూసింది. ప్రభుత్వం మారిన రేషన్ డీలర్ల సహకారంతో పిడిఎస్ మాఫియా కొనసాగుతుంది. ఇప్పటికైనా పేద ప్రజలకు అందాల్సిన బియ్యం అందేలా చూడాలి.

గంజాయి , కల్తీకల్లు నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్

నవతెలంగాణ-ఆర్మూర్

గంజాయి, కల్తీకల్లు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు, యువత మత్తు పదార్థాలకు గంజాయి మహమ్మారికి బానిస కావొద్దుని ఎక్సైజ్ శాఖ సీఐ స్టీవెన్ సన్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి గంజాయి అని, గంజాయి నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పట్టణాల్లో పల్లెల్లో పాకిన గంజాయి మహమ్మారి నియంత్రణ ప్రజల సహకారం అవసరమని ఆయన అన్నారు. గంజాయి సేవించినట్టు విక్రయించినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయిని సమాజం నుంచి తరిమి వేసేందుకు ఎక్సైజ్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.. గంజాయి ఇతర మత్తు పదార్థాలను యువతకు దరిచేరకుండా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి నిఘాలు ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తున్నామని హెచ్చరించారు.

కల్తీ కల్లు తయారుచేస్తే కఠిన చర్యలు..

గ్రామాల్లో, పట్టణాల్లో కల్తీకల్లు తయారీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని . కల్తీ కల్లు తయారీదారులు ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని ఆయన హితవు పలికారు. లైసెన్స్ లేని కల్లుకి దా కార్మికులు లైసెన్స్ లో పొందాలని సూచిస్తూ సహజసిద్ధమైన కళ్ళు ప్రజలకు అందించాలని ఆయన అన్నారు. మందు కలిపిన కల్లు వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



అక్రమ మద్యం రవాణాపై సరిహద్దులో నిఘా..

అక్రమంగా జిల్లాలోకి వచ్చే మద్యం రవాణాపై గట్టిగా ఏర్పాటు చేశామని అన్నారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం రవాణా జరగకుండా చెక్ పోస్టు సరిహద్దులో నిఘాని పెంచినప్పటికప్పుడే కేసులు నమోదు చేసి చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. గడిచిన 70 రోజుల్లో పరిధిలో కల్తీ కళ్ళు మద్యం రవాణా తదితర విషయాల్లో 25 కేసులను నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ పేర్కొన్నారు. గత జనవరి నుంచి ఈ నెల వరకు 03 కల్తీకల్లు కేసులు, 13 టు డి షాంపూల్స్ నమోదు చేసి సదరు వ్యక్తులపై కేసులు పెట్టామని అన్నారు. అలాగే 8సారా, అక్రమ మద్యం ఒక కేసు, కల్లు దుకాణాలపై 3కేసులు, కల్లు నమూనాల కేసులు13, అక్రమమద్యం ఒక కేసు మొత్తంగా 27 కేసులు నమోదు చేశామని అన్నారు. 80 లీటర్ల వాష్ ఐడిని ధ్వంసం చేశామని, 80కిలోల బెల్లం పట్టుకొని కేసులు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా 270 గ్రాముల గంజాయిని పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి బైకును స్వాధీనం చేస్తుకుని పేర్కొన్నారు.

325 మందిని బైండోవర్ చేశాం..

కల్తీ కళ్ళు గంజాయి అక్రమ మద్యం రవాణా పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 325 మందిని బైండోవర్ చేశామని ఎక్సైజ్ సిఐ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వ్యక్తులను రెండు లక్షల జరిమానా విధించామని అన్నారు. గంజాయి, కల్తీకల్లు, అక్రమ మద్యం రవాణాపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. ప్రజల సహకారంతోనే గంజాయిని అక్రమమద్యాన్ని నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

11న నడ్పల్లి తైబజార్ వేలం

- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మండల కేంద్రంలోని నడ్పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 11న సోమవారం తైబజార్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్, మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి నిట్టు కిషన్ రావు శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ప్రభుత్వ నిబంధనలను పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు 50 వేల రూపాయలు ముందుగా గ్రామ పంచాయతీలో డిపాజిట్‌గా చెల్లించి రశీదు పొందాలని సూచించారు. డిపాజిట్ చెల్లించిన వారికి మాత్రమే వేలంలో పాల్గొనడానికి అనుమతించ బడుతుందని పేర్కొన్నారు. గతేడాది కౌలు బకాయిలు ఉంటే పంచాయతీకి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పంచాయతీలో ఎలాంటి బకాయిలుఉన్నా వేలం పాటలో పాల్గొన వద్దని, లక్ష రూపాయల ఆస్తి, ధ్రువ పత్రం సంబంధిత పంచాయతీల నుండి, కార్యదర్శుల సంతకంతో జారీ చేయబడి ఉండాలని పేర్కొన్నారు. యజమాని సంతకం ఉంటేనే అంగీకరించ బడుతుందని వివరించారు. వేలం దక్కించుకున్న వారు చెల్లించిన డిపాజిట్, ధరావత్తు కలుపుకొని నాలుగో వంతు చెల్లించాలని వివరించారు. వేలంలో కనీస ధర రాని పక్షంలో రద్దు పరచే అధికారం గ్రామ పంచాయతీకి ఉందని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ గ్రామ పంచాయతీ ఆమోదించబడిన రేట్లను మాత్రమే వసూలు చేయవల్సి ఉంటుందని, అంతకు మించి వసూలు చేస్తే వేలంను రద్దు చేస్తామని తెలిపారు. వేలం పాడుకున్నవారు ఏదైన కారణాలతో నెలసరి వాయిదాలు చెల్లించకపోతే వేలం హక్కులు రద్దు చేసి తిరిగి వేలం వేసే అధికారం పంచాయతీకి ఉందని పేర్కొన్నారు. రెండవ వేలం ద్వారా వచ్చిన నష్టాన్ని మొదటి వేలం పొందిన వ్యక్తి నుండి వసూలు చేయబడుతుందని వివరించారు.

నలంద పాఠశాలలో జబర్దస్త్ టీం సందడి

- ఘనంగా 20వ వార్షికోత్సవం
- నృత్యాలతో అలరించిన చిన్నారులు



నృత్యాలు చేసిన చిన్నారులు



జబర్దస్త్ ఫేం బుల్లెట్ భాస్కర్ టీంతో

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లిలో నలంద హైస్కూల్లో 20వ వార్షికోత్సవ వేడుకలు పాఠశాల ఆవరణలో గురువారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ టీం సందడి చేసింది. విద్యార్థిని విద్యార్థులు నృత్యాలతో అలరించారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ పాఠశాల ఇంత స్థాయికి రావడానికి గల కారణం విద్యార్థులు. తల్లిదండ్రుల ప్రోత్సాహమేనని తెలిపారు. ముందు ముందు కూడా ప్రోత్సాహం అందిస్తే ఇంకా నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అద్భుతంగా నత్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసిపి బసవ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజా, ఎంఈఓ రాజ గంగారం, జబర్దస్త్ ఫేమ్ బుల్లెట్ భాస్కర్ టీం, మున్సిపల్ కౌన్సిలర్ల ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసి యేషన్ సభ్యులు హాజరయ్యారు. ముఖ్య అతిథులు ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి గొప్ప వ్యక్తుల జీవితాలను ప్రేరణగా ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన జూనియర్ సివిల్ జడ్జి



కుటుంబీకులతో కలిసి మొక్కులు తీర్చుకుంటున్న జడ్జీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ శ్రీ బాల రాజేశ్వర స్వామీని శుక్రవారం ఆర్మూర్ జూనియర్‌సివిల్ జడ్జీ దీప్తి వేముల కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోడెను కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్‌సివిల్ జడ్జీ దీప్తి వేములకు ఆలయ పూజారి పవన్ పంతులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలోఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సరసం చిన్నారెడ్డి, మాజీ పిపిలు అవారి రమేష్, అవుల అశోక్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు బద్దం రమేష్ రెడ్డి, సభ్యులు సుంకరి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర్ గ్రామ శివారులో గల జ్యోతి పూలే బీసీ గురుకుల పాఠశాలను శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ గాను ఇక్కడ పాఠశాలలో భూపతిరెడ్డి ప్రారంభించారు. 24 కోట్ల వ్యయంతో నూతన భవనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ. అన్నిటికంటే గొప్పదైన ఆస్తి విద్య అని, ఇది తరిగిపోయే వనరు కాదని విద్య వల్ల గొప్పవాడు అయితే కుటుంబానికి మన దేశానికి గర్వకారణంగా ఉంటుందని తెలిపారు. సకల సౌకర్యాలతో ప్రభుత్వ భవనాలు యూనిఫార్మ్ మౌలిక సదుపాయాలన్నీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి ప్రాధాన్యత విద్యారంగానికి ఇస్తున్నాడని అన్నారు. విద్యార్థులు ఒక గోల్ ఎంచుకొని దానికి తగ్గట్టు శ్రమ పడాలని, సమాజంలో విద్య ఉన్నవారికి గుర్తింపు ఉంటుందని ఆయన తెలిపారు. స్కిల్స్ పెంపొందించుకోవడం వల్ల ఈ ప్రపంచ గ్లోబలైజేషన్లో పోటీ తత్వాన్ని తట్టుకోవచ్చని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే విద్యార్థులకు చాలా తెలివి ఉంటుందని, వారు ఏ రంగంలోనైనా రాణిస్తారని ఆయన తెలిపారు. టీచర్లకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అంకిత్, ఆర్‌సిఓ సత్యనాథ్ రెడ్డి, ముప్పా గంగారెడ్డి, మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, శేఖర్ గౌడ్, సూర్య రెడ్డి, బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు



ట్యాంక్ బండ్‌పై వెలుగులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో నూతనంగా నిర్మించిన ట్యాంక్ బండ్ విద్యుత్ వెలుగులతో కనువిందు చేస్తోంది. నందిగుట్టకు వచ్చిన ప్రజలు రంగురంగుల విద్యుత్ వెలుగుల మధ్య ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్నారు.

కుటుంబాల గొడవలకు పార్టీపై నిందలు వేయడం సరికాదు

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి

రెండు కుటుంబాల మధ్య జరుగుతున్న గొడవలకు కాంగ్రెస్ పార్టీపై నిందలు వేయడం సరికాదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సోమా దేవరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏర్గట్ల గ్రామంలో గత రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ నాయకుడిపై వ్యక్తిగతంగా దాడి జరిగితే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి అనుచరులే దాడి చేశారని నిందలు వేయడం సరియైంది కాదని అన్నారు. రెండు కుటుంబాల మధ్య జరుగుతున్న ఘర్షణలకు కాంగ్రెస్ పార్టీని, బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ని బద్నాం చేయడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటి నుండి ఆ రెండు కుటుంబాలకు ఘర్షణలు జరుగుతున్నాయని. ఏ పార్టీకి చెందిన వారు తప్పు చేసినా ఊరుకునేది లేదని, చట్టం ఉందని, దాడి చేసిన వారిపై కేసులు కూడా నమోదు అయ్యాయని అన్నారు. ఇకనైనా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు చిల్లర రాజకీయాలను, అబద్ధపు ప్రచారాలను మానుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులపై, అమాయకులైన ప్రజలపై ఎన్ని దాడులు జరిగాయో, ఎన్ని అక్రమ కేసుల్లో ఇరికించారో ప్రజలకు తెలుసునని అన్నారు. తమ నాయకుడిపై అనవసర ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ తప్పులను ప్రోత్సాహించదని, నిజానిజాలు తెలుసుకోవాలని హితవు పలికారు. మీరు ఎన్ని అబద్దాలు ప్రచారాలు చేసినా నిజమేదో ప్రజలకు తెలుసని, రెచ్చగొట్టే రాజకీయాలు చేయొద్దని అన్నారు. మీరు ప్రతిపక్షంలో ఉన్నారని తెలుసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని అన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, నాయకులు ముస్కు మోహన్ రెడ్డి, గడ్డం జీవన్, పెద్దిరెడ్డి రవి, పన్నాల నర్సారెడ్డి, దండేవోయిన సాయికుమార్, అజయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన స్వప్నలోక్ కాలనీ వాసులు



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లిలోని స్వప్నలోక్ అసోసియేషన్ కాలనీవాసులు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వప్నలోక్ కాలనీలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని, కాలనీ అభివృద్ధి కొరకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్వప్నలోక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడకల గోవర్ధన్, ఉపాధ్యక్షుడు పసులాది రాజు, కార్యదర్శి మాలావత్ దశరథ్, కోశాధికారి వజీర్ మారుతీరావు, కార్యవర్గసభ్యులు నీలం రమేష్, సర్దార్‌రెడ్డి, మొఖద్దం స్వామి, సత్యనారాయణ, డాక్టర్ పల్స హరీష్‌గౌడ్, వెంకటేశ్వరశర్మ హర్ష తదితరులు పాల్గొన్నారు.

ప్రాణలు పోయాక.. సూచిక బోర్డులు



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. అయితే ఆ ప్రాంతంలో సూచిక బోర్డులు లేకపోవడం వల్లనే భార్యభర్తలిద్దరూ రోడ్డు ప్రమాదంలో ఇటీవలో ప్రాణాలు కోల్పోయారు. నిండు ప్రాణాలు పోయాక.. సంబంధిత కాంట్రాక్టర్ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.

నిబంధనల ప్రకారం రోడ్డు పనులు చేపట్టే చోట రేడియంతో కూడిన సూచిక బోర్డులు ఉండాలి. అలాగే డేంజర్‌ను సూచిస్తూ.. హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయాలి. కానీ 44వ జాతీయ రహదారి వద్ద చేపడుతున్న పనుల వద్ద సంబంధిత కాంట్రాక్టర్ ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. తద్వారా ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు దుర్మరణం చెందారు. వీరు మరణించిన తర్వాత సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఘనంగా శివరాత్రి వేడుకలు

- భక్తిశ్రద్ధలతో పూజలు
- కిక్కిరిసిన శివాలయాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

మహాశివరాత్రి వేడుకలను నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉపవాసాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రతీ శివాలయంలో భక్తులు కిక్కిరిసిపోయారు.



రామారెడ్డి : శివపార్వతుల కల్యాణోత్సవం..



స్వయంభూ బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయానికి క్యూ కట్టిన సందర్శకులు

రామారెడ్డి : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మద్దికుంట శ్రీ స్వయంభూ బుగ్గ రామలింగేశ్వర స్వామి, పోసానిపేట్ శ్రీ రాజరాజేశ్వర స్వామి, ఉప్పల్వాయితోపాటు గొల్లపల్లి శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మద్దికుంటలో శివ పార్వతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నరసింగ రావు, ధర్పల్లి ఎంపీపీ తదితరులకు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. శివపార్వతుల కళ్యాణం, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సందర్శకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆటవస్తువులతో ఆనందంగా గడిపారు. స్వామివారి రథోత్సవం శివ స్వాములు, గ్రామ యువత శివ నామస్మరణతో కన్నుల పండువగా నిర్వహించారు. శివరాత్రి పురస్కరించుకొని దాదాపు 1,50,000 మంది సందర్శకులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పలువురు దాతలు అంబలి, నీటి వసతిని ఏర్పాటు చేశారు. కామారెడ్డి డి.ఎస్.పి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శాంతిభద్రతలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. అత్యవసరానికి అన్నారం పిహెచ్సి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోజారి లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఆలయ ప్రధాన పూజారి జంగం ప్రభాకర్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని ఆయా గ్రామాలలో మహాశివరాత్రి పండుగ పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నీటి సౌకర్యాన్ని కల్పించారు. న్యావానంద్ రాజ్‌కుమార్, బొబ్బిలి శ్రీనివాస్, మల్లెపూలు శ్రీనివాస్ లతోపాటు జాతర ఉత్సవాలను జయప్రదం చేసేందుకు కృషి చేస్తున్నారు.

వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానాన్ని దర్శించుకున్న నాయకులు..

బోధన్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సాలూర మండల నాయకులు బుద్దె రాజేశ్వర్, ఇల్తెపు రమేష్, గంఢ్ల రాజేశ్వర్, శివకాంత్ పటేల్ వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం బోధన్ ఆర్డీవోగా పనిచేసి బదిలీపై వేములవాడ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన రాజేశ్వర్‌ను వారు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

కూనేపల్లి గ్రామ శివాలయంలో మహాయజ్ఞం..

రెంజల్ : మండలంలోని కూనేపల్లి గ్రామంలో మహాశివరాత్రి పండగను పురస్కరించుకొని శివాలయంలో మహాయజ్ఞం నిర్వహించారు. అలాగే శనివారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

త్రివేణి సంగమంలో శివనామస్మరణ..

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం భక్తులతో కిటకిటలాడింది. శివరాత్రి పండుగను పురస్కరించుకొని భక్తులు అత్యధిక సంఖ్యలో విచ్చేయడమే కాకుండా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రివేణి సంగమంలో శివనామస్మరణతో మారుమోగింది.

మద్నూర్ : మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజల కోసం శివాలయాలకు పోటేత్తారు. మండలంలోని సలాబత్పూర్ సమీపంలో గల శివాలయానికి అలాగే మద్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సోమలింగాల ఆలయానికి భక్తులు పోటెత్తారు.

త్రిలింగ రామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్..

నాగిరెడ్డిపేట్ : మండలంలోని తాండూర్ గ్రామంలో గల త్రిలింగ రామేశ్వర ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు కామారెడ్డి జిల్లా కలెక్టర్ వి జితేష్ పాటిల్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు మాట్లాడుతూ.. పురాతనమైన మహోత్తర శివాలయం దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. శివాలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎల్లారెడ్డి ఆర్‌డిఓ ప్రభాకర్ ఉన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు..

గాంధారి : మండల కేంద్రంలోని భోగేశ్వర ఆలయం, గుడిమెట్‌లోని మహాదేవుని ఆలయం, పోతంగల్‌లోని బుగ్గ రామేశ్వరాలయం, పెట్‌సంఘంలోని సంగమేశ్వర ఆలయం, బూర్గుల్ గ్రామంలోని రాజరాజేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు, అభిషేకలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం..

దోమకొండ : మండల కేంద్రంలోని శివరామ మందిరం ఆలయంలో మహా శివరాత్రి పండగ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు అబ్రబోయిన రాజేందర్ ఆలయం కమిటీ ఆధ్వర్యంలో శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేసి ఘనంగా కల్యాణం వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో శివ పార్వతులకు పలు అభిషేకాలు చేసి నైవేద్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఐరేని నర్సయ్య, ఈవో ప్రభు, ఆలయ కమిటీ సభ్యులు చెన్నం రవి, నాయిని లింగారెడ్డి, పున్న లక్ష్మణ్, కదిరె లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

108 జంటలతో రుద్రాభిషేకం..

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని పాపహరేశ్వర్ శివాలయంలో 108 మంది దంపతులతో ఏర్పాటు చేసిన రుద్రాభిషేకం కార్యక్రమంలో భాగంగా జుక్కల్ శాసన సభ్యులు తోటలక్ష్మికాంతారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో పురోహితులు శ్రీపథ్‌రావు, వెంకట క్రిష్ణ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, పార్టీ నాయకులు మోహన్, సంజీవ్, కల్లూరి పండరీ, శ్యామప్ప పటేల్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్ : రుద్రాభిషేకంలో పాల్గొన్న 108 జంటలు



నాగిరెడ్డిపేట్ : పూజలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే



దోమకొండ : శివపార్వతుల కళ్యాణం

ఘనంగా వివేకానంద పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఎంఈవో

నవతెలంగాణ-కోటగిరి

వివేకానందుని ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని మండల విద్యాధికారి నాగనాథ్ పేర్కొన్నారు. గురువారం శ్రీ వివేకానంద పాఠశాల 21 వార్షికోత్సవంతో పాటు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి నాగనాథ్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ పద్మ రిటైర్డ్ సోల్జర్ సంజీవ్ కుమార్, రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభాకర్ కులకర్ణి, వ్యక్తిత్వ వికాస నిపుణులు విద్యావికాస్, కళాశాల యాజమాన్య నిర్వాహకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, కోటగిరి విండో అధ్యక్షులు కూచి శ్రీనివాస్, అభయ హస్తం ఫౌండేషన్ నిర్వాహకులు బర్ల మధు తదితరులు హాజరై విద్యార్థులనుద్దేశించి పలు సూచనలు సలహాలు అందజేశారు. మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జవాన్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల పై అభినందన తెలిపారు. డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. వివేకానంద భావాజాలం యువతను వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుందన్నారు. అనంతరం మండల విద్యాధికారి నాగనాథ్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పడ్డ శ్రమకు మంచి ఫలితాలు తీసుకురావాలన్నారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేస్తారని కితాబునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



నృత్యాలతో అలరిస్తున్న విద్యార్థులు

మాజీ ఎమ్మెల్యే మతిభ్రమించి మాట్లాడటం సరికాదు

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి



మాట్లాడుతున్న నాయకులు రాంరెడ్డి

నవతెలంగాణ-పిట్లం

జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు దళితుడు కాదని, ఆయనపై మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మతిభ్రమించి వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి హితవు పలికారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పై కోర్టులో కేసు వేశాను మరో మూడు నెలల్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఎమ్మెల్యే పదవి పోవడంతో తానే ఎమ్మెల్యేగా కొనసాగుతాననడం, గన్‌మెన్‌లు లేనిదే ప్రజల్లో తిరగడని వారి కార్యకర్తల సమావేశంలో వెల్లడించడం దారుణమన్నారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోవడం వల్ల ఏవేవో మాట్లాడడం సరికాదని అన్నారు. షిండే ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గన్‌మెన్‌లు లేనిదే తిరిగసాగినావా? అంటూ ప్రశ్నించారు. గతంలో టిడిపి, బిఆర్ఎస్ పార్టీలో నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గంలో ఏమీ అభివృద్ధి చేశావని నిలదీశారు. స్వార్థ రాజకీయాలతో పబ్బం గడుపుతున్నావని విమర్శించారు. ప్రస్తుతం తమ ఎమ్మెల్యే నియోజకవర్గంపై పట్టు సాధించి ప్రతి శాఖల వారీగా అధికారులతో చర్చించి గ్రామీణ రోడ్లు, మంచి నీటిపై దృష్టి పెట్టి ప్రజలను ఆదుకుంటున్నారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అవ్వడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మారెడ్డి కృష్ణారెడ్డి, చిప్ప శివ, ఏనుగండ్ల శ్రీనివాస్‌రెడ్డి, డాకూరి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగ రామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీటీసీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మహాశివరాత్రి సందర్భంగా నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూరు గ్రామంలో గల త్రిలింగేశ్వర ఆలయంలో జెడ్పిటిసి సభ్యుడు మనోహర్ రెడ్డి శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట గాంధారి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యంరావు, లింగంపేట్ జెడ్పిటిసి శ్రీలత సంతోష్ రెడ్డి ఉన్నారు.

కిచెన్ షెడ్డుతో పౌష్టికాహారం

- ఆదర్శంగా నిలుస్తున్న పలు అంగన్‌వాడీ కేంద్రాలు

నవతెలంగాణ-ఎడపల్లి



కిచెన్‌షెడ్డులో పాలకూర సాగు

అంగన్వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికా హారం అందించేందుకు కిచెన్‌షెడ్డులను ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కిచెన్‌షెడ్డును ఏర్పాటు చేసి అందులో వివిధ రకాల కూరగాయలను పండించి వాటితోనే పౌష్టికాహారాన్ని అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి పలు అంగన్‌వాడీ కేంద్రాలు.

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామంలోని 108 అంగన్వాడీ కేంద్రంలో కిచెన్ షెడ్డును ఏర్పాటుచేశారు. పాలకూర, గోంగూర, మెంతంకూర, సొరకాయ, వంకాయను పండిస్తున్నారు. అలాగే జామ, మామిడి చెట్లను పెంచుతున్నారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారి బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్యతోపాటు ఆటపాటలను నేర్పిస్తూ, కేంద్రానికి వచ్చే చిన్నారి బాలబాలికలు ఆరోగ్యంగా ఉండాలని న్యూట్రిన్స్ ఆహార పదార్థాలను అందజేస్తున్నారు.



పిల్లలకు ఆరోగ్యవంతులుగా ఉంచడమే లక్ష్యం



అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలను ఆరోగ్యవంతులుగా ఉంచడమే మా లక్ష్యం. పిల్లలకు సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార పదార్థాలతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. గ్రామస్తుల సహకారం, తాజా మాజీ ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిది.

- అంగన్వాడీ ఉపాధ్యాయురాలు దేవ కుమారి

విద్యా బోధనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-రెంజల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి జరగాలంటే విద్యార్థులలో ఉండే సృజనాత్మకతను వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, విద్యపైన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి స్పష్టంచేశారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల నూతన భవనాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించారు. రూ.18కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెంజల్ మండలంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఉర్దూ, ఆంగ్లమాధ్యమాన్ని బోధిస్తున్నారని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బోధించాలని ఆయన సూచించారు. ఆయన బాలికలతో ముచ్చటిస్తూ విద్యాబోధన, గ్రేడ్లు ఎలా వస్తున్నాయని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పాఠశాలలలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి కోటి 50లక్షల రూపాయలు కేటాయించినట్టు తెలిపారు. అవసరమైతే మరోకోటి రూపాయలను కేటాయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యాబోధనతో పాటు వారికి పౌష్టికమైన ఆహారం అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వారిని తొలగిస్తామని హెచ్చరించారు. విద్యతో పాటు, కంప్యూటర్, కుట్టు మిషన్లలో ఆసక్తి కలిగిన విద్యార్థుల కోసం 25 కంప్యూటర్లను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ హనుమంతు, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, జడ్పీ వైస్ చైర్మన్, జెడ్పిటిసి మేక విజయ సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మొబిన్‌ఖాన్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి కృష్ణవేణి, ఆర్‌సిఓ బషీర్, తహసీల్దార్ ఎండి కలీం, స్థానిక నాయకులు జావిద్, సాయిరెడ్డి, గియాసుదన్, బాబు, సిహెచ్ రాములు, షౌకత్, బన్సియా, ఎమ్మెస్ రమేష్ కుమార్, కురుమే శ్రీనివాస్, సాయిబాబా గౌడ్, గంగాగౌడ్, గంగాకిషన్, నరసయ్య, యువజన నాయకులు కార్తీక్, మాజీ ఎంపీటీసీ సవిత రవి, గైని కిరణ్, సయ్యద్ సల్మాన్, సోక్కుల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండలానికి సంబంధించిన వివిధ గ్రామాలలో 17 కళ్యాణలక్ష్మి చెక్కులు, 50 షాదీముబారక్ చెక్కులను అందజేసినట్టు తహసీల్దార్ ఖలీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోబీన్ ఖాన్, కిసాన్ సెల్ మండలాధ్యక్షులు సురేందర్‌గౌడ్, జి.సాయిరెడ్డి, శనిగరం సాయిరెడ్డి, బాబన్న, హాజీఖాన్, నీరడి సాయిలు, ఎమ్మెల్ రాజు, సద్దాం, ప్రభాకర్, ఇంద్రారెడ్డి, వోడ్డెక్క మోహన్, సాయినాథ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లకు భలే గిరాకీ

నవతెలంగాణ-సదాశివనగర్/గాంధారి

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో, సదాశివనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలకు భలే గిరాకీ పెరిగింది. మహా శివరాత్రి సందర్భంగా పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. అరటి పండ్లు డజను రూ.89, ద్రాక్ష కిలో రూ.120, సపోటా కిలో రూ.120, కర్బూజా కిలో రూ.40 పలికాయి.

గాంధారి : మండల కేంద్రంలో పండగ పూట పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు ఉపవాస దీక్ష ఉండి సాయంత్రం పండ్లు పలాలతో ఉపవాస దీక్షను విరమిస్తారు. దీన్ని ఆసరాగా చేసుకుని పండ్ల వ్యాపారులు సాధారణ రోజుల్లో కన్నా రెట్టింపు ధరలకు పండ్లను విక్రయించారు. పండ్లు కొనుగోలుకు ప్రజలు పండ్ల దుకాణాల దగ్గర విపరీతమైన జనం ఉండడంతో దీన్ని ఆసరాగా చేసుకుని పండ్ల వ్యాపారులు ధరలు అమాంతం పెంచేశారు.



గాంధారి : మార్కెట్‌లో పండ్ల విక్రయాలు


కమ్మర్‌పల్లి: శ్రీ బాలరాజ్యేరస్వామి దర్శనంకోసం క్యూ


కమ్మర్‌పల్లి : బెల్లంతో తులాభారం వేస్తున్న భక్తులు


ముప్కాల్ : పడిలేచిన మర్రిచెట్టు దేవాలయంవద్ద భక్తుల క్యూలైన్

శివనామ స్మరణతో మారుమోగిన శైవక్షేత్రాలు

- పలు ఆలయాల్లో శివ పార్వతుల కళ్యాణం
- దర్శనంకోసం బారులు తీరిన భక్తులు

నవతెలంగాణ-విలేకరులు

కమ్మర్‌పల్లి:హరహర మహ దేవ.....శంభో శంకర అంటూ భక్తుల శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. మండలంలో మహా శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. దక్షణ కాశీగా పేరుగాంచిన ఉప్లూర్‌లోని శ్రీ బాల రాజేశ్వరస్వామీ ఆలయంలో మహా శివరాత్రి జాగరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జమునుండే భక్తులు బాల రాజేశుడిని దర్శించుకొన్నారు. ఆలయంవద్ద ఉదయం నుండే పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరారు. ఇరత ప్రాంతాల నుండి వేలాదిగా వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు కోడెలు సమర్పించుకున్నారు. పుట్టు వెంట్రుకలు, బెల్లంతో తులాభారం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉపవాస దీక్షలతో భక్తులు శుక్రవారం అర్ధరాత్రి స్వామి వారి మహారుద్రాభిషేకంలో, రిశావా ఊరేగింపులో భక్తులు పాల్గొని ఆలయంలోనే శివరాత్రి జాగరణ చేస్తారు. శనివారం మారోమారు బాల రాజేశ్వరుడిని దర్శించుకొని స్వస్థలాలకు వెళ్తారు. సుమారు 60వేలకు పైగా మంది భక్తులు జాతర ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. మండలంలోని చౌట్‌పల్లిలోని శ్రీ పార్థివ కోటి లింగేశ్వర స్వామీ ఆలయంలో, అమీర్‌నగర్ శివగుట్ట ఆలయంలో, కమ్మర్‌పల్లి శ్రీ గిరి క్షేత్రంపై, గొల్లపేట శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. కమ్మర్‌పల్లి, అమీర్‌నగర్ గ్రామాల్లోని శివాలయాల్లో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మొక్కులు తీర్చుకున్న బినోల సొసైటీ చైర్మన్

నవీపేట్: మండలంలోని నాలేశ్వర్ గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు దంపతులు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం కోడే దూడలను వదిలి మొక్కులను తీర్చుకున్నారు. అంతకుముందు అభిషేకం నిర్వహించారు. పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు పుష్కలంగా పండాలని కోరుకున్నారు.

సిరికొండ:మండల కేంద్రంలోని తాళ్ల రామడుగు రామాలయ ఆలయంలో ఆలయ చైర్మన్ బచ్చు పురుషోత్తం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివ పార్వతుల కళ్యాణం జరిపించారు

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మూడు రోజులపాటు శ్రీలొంక రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు మూడు రోజులు జరుగుతాయి. మొదటి రోజున రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి ఆలయాన్ని దర్శించుకుని, శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాకారం రవి, మల్లేష్ యాదవ్ మైనార్టీస్ అధ్యక్షుడు ఆసిఫ్ , గ్రామ శాఖ అధ్యక్షుడు దిగంబర్, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ శోభన్, తదితరులు పాల్గొన్నారు.


నిజామాబాద్‌సిటీ : పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

భీంగల్:భీంగల్ పట్టణ కేంద్రంతోపాటు గ్రామాల్లోగల శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణ కేంద్రంలోని నందీశ్వర ఆలయానికి వచ్చే భక్తులకు సర్వ సమాజ్ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాత్రి నందీశ్వర ఆలయం వద్ద అగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని బడా భీంగల్ గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద గ్రామ అభివద్ధి కమిటీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆర్మూర్ :పట్టణంలోని మామిడిపల్లి, పెర్కిట్ మండలంలోని చేపూర్ గ్రామ శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని నవ సిద్దుల గుట్టపై ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కుటుంబ సమేతంగా పూజలు చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల్లో రాజకీయం తగదని ఆలయ కమిటీకి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, రాజకీయ జోక్యం అవసరం లేదని అన్నారు. పర మతస్తులు అంటే గౌరవం ఉందని, ఎన్నికల వరకు రాజకీయాలు అని, ప్రతి దానిని రాజకీయం చేస్తే సహించేది లేదు అని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే తో పాటు రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ద్యగ ఉదయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజాల్లో అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్ సిటీ :మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శ్రీ లింగేశ్వర గుట్ట ఆశ్రమం మల్లారంలో, నంది గుట్ట శివాలయం, శ్రీ రాహు కేతు ఆలయం, శ్రీ భక్త మార్కండేయ భవాని శంకర ఆలయం, ఉమామహేశ్వర ఆలయం, శంభుడి గుడి, నీలకంఠేశ్వర ఆలయం, దేవాలయాల్లో అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపవాస దీక్షలు, జాగారాలతో శివున్ని కొలుచుకునే పండుగ శివరాత్రి అని అన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు, నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్స్, పంచ రెడ్డి ప్రవళిక శ్రీధర్, నీచ్చంగ్ లతా కష్ణ, మాస్టర్ శంకర్, ఇల్లెందుల మమత ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

మాక్లూర్:మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం వద్ద మహశి మహశివరాత్రి వేడుకలను గ్రామ కమిటీ అధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిపారు. అనంతరం యజ్ఞ, హోమం కార్యక్రమలు నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణ సభ్యులు యజ్ఞంలో పాల్గొన్నారు. సాయంకాల స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. శనివారం ఉదయం 7 గంటలకు జరిగే అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని గ్రామ అభివద్ధి కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ అభివద్ధి కమిటీ అధ్యక్షులు నరేందర్, ఊరడీ నరేష్, గంగా ప్రసాద్, మేకల లక్ష్మి నారాయణ, ఇటుకల నరేష్, మల్లేష్ గౌడ్, కల్లెడ అనిల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం 'శ్రీ మహా శివలింగేశ్వర స్వామి' మహోత్సవాలతో పాటు మండలంలోని కొత్తపల్లి, వేంపల్లి గ్రామాలలో శివరాత్రిని పురస్కరించుకుని స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పిల్లపాపలతో పాల్గొన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని 'శ్రీ శివ పార్వతుల' కళ్యాణ మహోత్సవం, వేంపల్లిలో 'శ్రీ రాజరాజేశ్వర' ఆలయంలో స్వామి వారి కళ్యాణ ఉత్సవాలను ఆలయ అర్చకులు ఘనంగా చేపట్టారు. భక్తుల శనివారం అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ముప్కాల్, వేంపల్లి, కొత్తపల్లి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సిరికొండలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి


మాక్లూర్ : యజ్ఞంలో పాల్గొన్న గ్రామస్తులు


ఆర్మూర్ : సిద్దులగుట్టపై పూజల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే